ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి బ్యాతల శివశంకర్ మాదిగ ఆకస్మిక మృతి ఉద్యమానికి తీరని లోటని ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ అన్నారు. ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన శివశంకర్ మాదిగ కుటుంబాన్ని స్థానిక నాయకులతో కలిసి గురువారం ఆయన పరామర్శించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం టంగటూరు గ్రామంలోని శివశంకర్ మాదిగ నివాసానికి వెళ్లిన మందకృష్ణ మాదిగ, ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను కలిసి పరామర్శించి, వారి దుఃఖంలో పాలుపంచుకున్నారు. శివశంకర్ మాదిగ మరణానికి సంబంధించిన వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. శివశంకర్ మాదిగ తల్లిదండ్రులు, భార్య, పిల్లలను మందకృష్ణ మాదిగ ఓదార్చారు. ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచిస్తూ, వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా కల్పించారు. ఆప్తుడిని కోల్పోయిన కుటుంబానికి మనోధైర్యం కల్పిస్తూ, వారి కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ...

ఎమ్మార్పీఎస్ ఉద్యమంలో శివశంకర్ మాదిగ క్రియాశీలకంగా పనిచేశారని, ఉద్యమం పట్ల నిబద్ధతతో వ్యవహరించిన వ్యక్తిగా గుర్తింపు పొందారని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆయన అకాల మరణం చేవెళ్ల ప్రాంతంలో ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి తీరని లోటని అన్నారు. ఉద్యమంలో ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగల్ల ఉపేందర్ మాదిగ, ఎంఎస్పీ జిల్లా మాజీ అధ్యక్షుడు రావుగళ్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మాజీ జిల్లా అధ్యక్షుడు పెంటనోళ్ల నర్సింహ మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగాళ్ల ప్రవీణ్ కుమార్ మాదిగ, శంకర్‌పల్లి మండల అధ్యక్షుడు లింగం సాయి మాదిగ, ప్రధాన కార్యదర్శి దాసరి నాగేష్ మాదిగ, చేవెళ్ల మండల అధ్యక్షుడు మల్లేష్ మాదిగ, మొయినాబాద్ మండల అధ్యక్షుడు కుమార్ మాదిగ, షాబాద్ మండల అధ్యక్షుడు ముల్కి ప్రవీణ్ మాదిగ, ఎంఎస్పి మండల అధ్యక్షులు బోడ ప్రశాంత్ మాదిగ, శంకర్ పల్లి మున్సిపల్ అధ్యక్షులు కటికే మోహన్ మాదిగ తదితరులు పాల్గొన్నారు. ఎంఎస్‌పీ మండల అధ్యక్షుడు కూడా పాల్గొన్నారు.



## రైతులను బెదిరిస్తే సహించేది లేదు మధ్యవర్తుల ఆగడాలకు అడ్డుకట్ట వేయాలి!

- **జొన్నల విక్రయాల్లో తక్కువ మొత్తాలు జమయ్యాయని ప్రశ్నించిన రైతులకు బెదిరింపులు.**
- **బాధ్యులు ఎవరైనా సరే వదిలిపెట్టే ప్రసక్తే లేదు**
- **కొండ సాయి ప్రసాద్ హెచ్చరిక?**

**నిర్మల్ జిల్లా,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

కుబీర్,జొన్నలు విక్రయించిన రైతులకు రావాల్సిన డబ్బుల కంటే తక్కువ మొత్తం బ్యాంకు ఖాతాల్లో జమ కావడంపై సంబంధిత వ్యక్తులను ప్రశ్నించిన రైతులను బెదిరిస్తున్నారనే ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. దేశానికి వెన్నెముకగా నిలుస్తున్న రైతన్నలు తమ కష్టానికి తగిన ప్రతిఫలం అడిగితే బెదిరింపులకు గురిచేయడం ఎంతమాత్రం సమర్థనీయం కాదని కొండ సాయి ప్రసాద్ తీవ్రంగా స్పందించారు. రైతులకు న్యాయం జరగాల్సిందేనని, వారి హక్కులను కాలరాసే ప్రయత్నాలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని స్పష్టం చేశారు. జొన్నలను పండించేందుకు రైతులు నెలల తరబడి కష్టపడుతూ, పెట్టుబడులు పెట్టి, ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొని పంటను చేతికి తెచ్చుకుంటారని పేర్కొన్నారు. పంట సాగు కోసం విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీల ఖర్చులతో పాటు రవాణా వ్యయాలను భరిస్తూ అప్పులు చేసి మరీ వ్యవసాయం చేస్తున్న రైతులకు పంట విక్రయాల తర్వాత రావాల్సిన డబ్బులు పూర్తిస్థాయిలో అందడం అత్యంత కీలకమన్నారు. అలాంటి పరిస్థితుల్లో జొన్నలను విక్రయించిన కొంతమంది రైతుల ఖాతాల్లో రావాల్సిన మొత్తానికి భిన్నంగా తక్కువ డబ్బులు జమ కావడంతో వారు ఆ విషయాన్ని సంబంధిత వ్యక్తుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

తమకు రావాల్సిన డబ్బుల కంటే తక్కువ మొత్తం ఎందుకు జమ అయిందని, ఎంత మొత్తానికి జొన్నలు విక్రయించారు, ఎంత డబ్బు జమ చేశారు, మిగిలిన మొత్తం ఎక్కడ ఉందని రైతులు ప్రశ్నించడం వారి హక్కు అని కొండ సాయి ప్రసాద్ పేర్కొన్నారు. రైతులు తమకు జరిగిన ఆర్థిక నష్టంపై వివరణ కోరితే సంబంధిత వ్యక్తులు లెక్కలు చూపించి సమస్యను పరిష్కరించాల్సింది పోయి, వారిని భయపెట్టే ప్రయత్నాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు రావడం విచారకరమన్నారు.

**ఐకేపీ సబ్ సెంటర్ పేరుతో బెదిరింపులా?**

రైతులు ప్రశ్నించిన సందర్భంలో మీరు ఇలా ప్రశ్నిస్తే మీ గ్రామంలో ఉన్న ఐకేపీ సబ్ సెంటర్‌ను తొలగిస్తాం. ప్రజల్లో మీకు వ్యతిరేకత వచ్చేలా చేస్తాం. మిమ్మల్ని ఇబ్బందులకు గురిచేస్తాం అంటూ కొంతమందిని భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపణలు వస్తున్నాయని కొండ సాయి ప్రసాద్ తెలిపారు. ఈ తరహా బెదిరింపులు నిజమైతే వాటిని తీవ్రంగా పరిగణించాల్సిన అవసరం ఉందన్నారు.ఒక గ్రామంలో ఐకేపీ సబ్ సెంటర్ కొనసాగడం అనేది రైతులపై ఒత్తిడి తీసుకురావడానికి ఉపయోగించుకునే అంశం కాదని స్పష్టం చేశారు. రైతులు తమకు రావాల్సిన డబ్బుల గురించి ప్రశ్నించినంత మాత్రాన సబ్ సెంటర్‌ను తొలగిస్తామని చెప్పడం, గ్రామ ప్రజల్లో వారికి వ్యతిరేకత కల్పిస్తామని హెచ్చరించడం, వ్యక్తిగతంగా ఇబ్బందులకు గురిచేస్తామని భయపెట్టడం వంటి చర్యలు ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. రైతులు తమ సమస్యను వెల్లడించడానికి కూడా భయపడే పరిస్థితులు సృష్టించడం సరైన పద్ధతి కాదని పేర్కొన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఉన్నవారు వారిని బెదిరించడం కాకుండా, వారి సందేహాలకు సమాధానాలు ఇవ్వాలని సూచించారు. జొన్నల కొనుగోళ్లకు సంబంధించిన లెక్కలు పారదర్శకంగా ఉండాలని, రైతులకు అందాల్సిన చెల్లింపుల్లో ఎలాంటి వ్యత్యాసాలు ఉన్నా వాటిని పరిశీలించి స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.



**రైతుల కష్టార్జితంపై మధ్యవర్తుల పెత్తనం సహించేది లేదు..**

రైతుల శ్రమను ఆసరాగా చేసుకుని ఎవరైనా మధ్యవర్తులుగా వ్యవహరిస్తూ, బ్రోకర్ల పాత్ర పోషిస్తూ, రైతులకు రావాల్సిన డబ్బుల విషయంలో అన్యాయం చేస్తే చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదని కొండ సాయి ప్రసాద్ గట్టిగా హెచ్చరించారు. రైతులు పండించిన పంటను కొనుగోలు చేసే ప్రక్రియలో ఎవరికి ఏ బాధ్యత ఉందో స్పష్టంగా ఉండాలని,రైతులకు చెల్లించాల్సిన మొత్తాల విషయంలో ఎలాంటి గందరగోళానికి తావివ్వకూడదని అన్నారు.

## శ్రీ బంగారమ్మ దేవి ఆలయంలో కన్నుల పండువగా ఐదో రోజు శరన్నవరాత్రులు

- **లలితా త్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు**

**నందవరం,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

మండల కేంద్రమైన నందవరంలో కొలువైన శ్రీ మాతా బంగారమ్మ దేవి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు ఐదో రోజుకు చేరుకున్నాయి. ఆశ్వయుజ శుద్ధ పంచమి గురువారం సందర్భంగా ఆలయంలో ఐదో రోజు శరన్నవరాత్రి వేడుకలు భక్తులకు కన్నులపండువగా సాగాయి.



**శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా సాక్షాత్కారం:**

ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజున బంగారమ్మ తల్లి సకల శుభప్రదాయిని, త్రిపుర భైరవి అయిన శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి అవతారంలో భక్తులకు సాక్షాత్కరించారు. శ్రీచక్ర అధిష్ఠాన దేవతగా, చెరుకుగడ, పాశాంకుశాలను ధరించి గంభీర ముద్రలో కొలువైన అమ్మవారి దివ్య మంగళ రూపాన్ని భక్తులు దర్శించుకుని పులకించిపోయారు. లలితా దేవిని ఆరాధించడం వల్ల ఐశ్వర్యం, మనశ్శాంతి, సకల కోరికలు సిద్ధిస్తాయని భక్తుల విశ్వాసం.

**భక్తిశ్రద్ధలతో సాగిన ప్రత్యేక పూజలు**

ఈ సందర్భంగా ఆలయంలో పౌరోహితులు అనిల్ స్వామి ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచే వేద మంత్రోచ్చారణల నడుమ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు, లలితా సహస్రనామ పారాయణాలు శాస్త్రోక్తంగా సాగాయి. నిర్వహించారు. భక్తులు సమేతంగా అమ్మవారిని దర్శించుకున్నారు. పవిత్ర పంచమి తిథి కావడం, అమ్మవారి కమనీయ అవతారం కావడంతో భక్తులు,మహిళలు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు.ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది.భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు ప్రత్యేక ఏర్పాటు చేసి, పూజల అనంతరం భక్తులందరికీ తీర్థప్రసాదాలు అందించారు. భక్తుల జయజయధ్వానాలు, అమ్మవారి నామస్మరణలతో నందవరం ఆధ్యాత్మిక శోభతో పులకించిపోయింది.

## కరెంటు కోతల వల్లే పంటలు ఎండిపోయాయి

- **ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి**
- **బాన్సువాడ నియోజకవర్గ బిఆర్ఎస్ నాయకులు మోరిల్ శ్రీనివాసరావు**
- **ఎండిపోయిన పంటను పరిశీలించిన బిఆర్ఎస్ నాయకులు**

**బాన్సువాడ,అక్టోబర్ 14(ప్రజాక్షేత్రం):**

కామారెడ్డి జిల్లా బాన్సువాడ మండలంలోని హనుమాజీపేట్ గ్రామ శివారులో ఎండిపోయిన పంట పొలాలను బాన్సువాడ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు మోరిల్ శ్రీనివాసరావు, మాజీ రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు అంజిరెడ్డి స్థానిక నాయకులతో కలిసి బుధవారం పరిశీలించారు.పంటలు ఎండిపోవడంతో నష్టపోయిన రైతుల పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మోరిల్ శ్రీనివాసరావు మాట్లాడుతూ... పంట నష్టంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన రైతులకు తగిన పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతుల కష్టాల్లో వారికి బీఆర్ఎస్ పార్టీ తరఫున అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కరెంటు కోతల వల్లే రైతుల పంటలు ఎండిపోయాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం రైతులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించాలని డిమాండ్ చేస్తూ సబ్‌స్టేషన్‌ను ముట్టడించి, గేటు ముందు ధర్నా నిర్వహించారు.

రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ అందించాలని ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. రైతుల సమస్యలను తెలుసుకొని ప్రభుత్వం వెంటనే వారి సమస్యలను పరిష్కరించి పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ రైతు సమన్వయ సమితి జిల్లా అధ్యక్షుడు అంజి రెడ్డి , శివసూరి దుర్గం సంజీవులు, పిట్ల హన్మండ్లు, భాస్కర్ నాయక్, కార్యకర్తలు రైతులు పాల్గొన్నారు.



# రవీందర్ రెడ్డి నానమ్మ మృతి.

- **భాదిత కుటుంబాన్ని పరామర్శ.**
- **తెలంగాణ ప్రభుత్వం చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి.**

**యాలాల,అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

యాలాల మండలంలోని ఎన్నేపల్లి గ్రామానికి చెందిన బిఆర్ఎస్ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి నాన్నమ్మ సందాపురం రాసమ్మా స్వర్గస్తులైన నేపథ్యం గురువారం తెలంగాణ ప్రభుత్వం చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి ఎన్నేపల్లి లో పరమాశించారు. నివాసానికి వెళ్లి వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఇట్టి కార్యక్రమం లో సర్పంచ్ స్వరూప వెంకటేష్,మహిపాల్ రెడ్డి,వెంకటయ్య,వడ్డే రాములు,శేఖర్ రెడ్డి,వార్డు మెంబెర్ మల్లప్ప, ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.



# పుట్టినరోజు వేడుకల్లో సేవా స్ఫూర్తి.. పారిశుద్ధ్య మహిళలకు చీరల పంపిణీ!

- **దసరా పండుగ వేళ మహిళా కార్మికుల ముఖాల్లో ఆనందం నింపిన ఆందోజు సత్యం చారి దంపతులు**
- **పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి.. వారి కష్టాన్ని గుర్తించడం ఆత్మసంతృప్తినిచ్చింది: ఆందోజు సత్యం చారి**

**రంగారెడ్డి జిల్లా,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

పుట్టినరోజు వేడుకలను కేవలం సంబరాలకే పరిమితం చేయకుండా సమాజానికి సేవలందించే పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి ప్రాధాన్యమిస్తూ హస్తినాపురం డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆందోజు సత్యం చారి సేవా స్ఫూర్తిని చాటుకున్నారు. దసరా పండుగ వేళ పారిశుద్ధ్య మహిళా కార్మికులు నూతన వస్త్రాలు ధరించి సంతోషంగా పండుగ జరుపుకోవాలనే ఉద్దేశంతో తన పుట్టినరోజు సందర్భంగా సుమారు వందమంది మహిళా కార్మికులకు చీరలను పంపిణీ చేశారు. ఆయన సతీమణి శ్రీదేవితో కలిసి చీరలు అందజేసి మహిళా కార్మికుల సేవలను గుర్తించారు.

ఎల్బీనగర్ నియోజకవర్గంలోని హస్తినాపురం డివిజన్ పరిధిలోని సాగర్ ఎన్క్లేవ్‌లో ఉన్న ఈదులకంటి రామ్‌రెడ్డి గార్డెన్‌లో గురువారం ఆందోజు సత్యం చారి పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అభిమానులు, శ్రేయోభిలాషులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై కేక్ కట్ చేసి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలు కప్పి, గజమాలలతో సత్కరించారు.

**పారిశుద్ధ్య కార్మికుల సేవలకు గుర్తింపు**

పట్టణాలు, కాలనీలను పరిశుభ్రంగా ఉంచడంలో పారిశుద్ధ్య కార్మికుల పాత్ర ఎంతో కీలకమని ఆందోజు సత్యం చారి పేర్కొన్నారు. తెల్లవారుజామునే విధులకు హాజరై ప్రజలు నివసించే పరిసరాలను శుభ్రంగా ఉంచేందుకు వారు నిత్యం ఎంతో శ్రమిస్తున్నారని అన్నారు. ఎండ, వానలను సైతం లెక్కచేయకుండా ప్రజారోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం కష్టపడుతున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని సూచించారు.

**పండుగ వేళ చీరల పంపిణీతో ఆత్మసంతృప్తి**

దసరా పండుగను పారిశుద్ధ్య మహిళా కార్మికులు కూడా ఆనందంగా జరుపుకోవాలనే ఆలోచనతో చీరల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టినట్లు సత్యం చారి తెలిపారు. తన పుట్టినరోజు సందర్భంగా కష్టపడి పనిచేసే మహిళా కార్మికులకు చీరలు అందజేయడం తనకు ఎంతో ఆత్మసంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. పుట్టినరోజు వేడుకల్లో భాగంగా కార్మికుల సేవలను గుర్తించి వారికి గౌరవం ఇవ్వడం పలువురి ప్రశంసలు అందుకుంది. సొంత సంతోషాన్ని సమాజంతో పంచుకుంటూ, నిత్యం ప్రజల కోసం శ్రమించే పారిశుద్ధ్య కార్మిక మహిళలకు పండుగ ఆనందాన్ని అందించాలనే ఈ కార్యక్రమం సామాజిక బాధ్యతకు నిదర్శనంగా నిలిచింది. సేవ చేసే చేతులను గుర్తించి గౌరవించడమే నిజమైన సంతోషమనే సందేశాన్ని ఆందోజు సత్యం చారి తన పుట్టిన రోజు వేడుకల ద్వారా చాటారు.

# ఘనంగా జాతీయ మహిళ రైతు దినోత్సవం

**శంషాబాద్,అక్టోబర్15 (ప్రజాక్షేత్రం)**

శంషాబాద్ మండల పరిధిలోని నానాజీపూర్ గ్రామంలో గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారు నానాజీపూర్ గ్రామంలో జాతీయ మహిళా రైతు దినోత్సవం ఘనంగా నిర్వహించారు.ఇందులో భాగంగా మహిళ సాధికారత పైన అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ సురేఖ రాజు,ఉప సర్పంచ్ విజయ్ కుమార్,పంచాయతీ కార్యదర్శి జోష్ణ,వార్డు సభ్యులు, శాస్త్రవేత్తలు నీలారాని, సునీత,శ్వేత,లక్ష్మి ,స్వరూప, దీప,గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# మత్స్యగిరి బయో ఎనర్జీ కంపెనీకి భూమి పూజ

**వలిగొండ,అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని నర్సాపురం గ్రామ పరిధిలోని చిత్తాపురం స్టేజి సమీపంలో పీసరి వెంకటరెడ్డి వ్యవసాయ క్షేత్రంలో అతిరత్ హోల్డింగ్ ఇండియా లిమిటెడ్ ఆధ్వర్యంలో మత్స్యగిరి బయో ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీకి గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా చైర్మన్ లెఫ్టినెంట్ కర్ణన్ ఆర్ బాలకృష్ణన్, టెక్నికల్ డైరెక్టర్ కేసి కేశవ్ మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత వ్యర్థాలతో ఎండి వరిగడ్డి , సొప్ప, నేపియర్ గ్రాస్ తోటి ఆధారిత పరిశ్రమ 20 టీపిడి సామర్థ్యం గల బయో సిఎన్జి ప్రాజెక్టు నెలకొల్పడానికి భూమి పూజ చేయడం జరిగింది. ఈ పరిశ్రమతో ప్రాంతీయ రైతులకు మరియు నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలతో పాటు, రైతులకు ఆర్థిక భరోసా స్థిరమైన ఆదాయము లభిస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో నర్సాపురం గ్రామ సర్పంచ్ కాబట్టి మంజుల ఉప్పలయ్య, ముద్దాపురం సర్పంచ్ సామ సరస్వతి రామిరెడ్డి, రైతులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ బడులు!

- **రంగుల గోడచిత్రాలతో ఆహ్లాదకరమైన వాతావరణం**
- **పాలకవర్గం చొరవ.. దాతల చేయూతతో బండరావిరాలలో విద్యా విప్లవం**

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి/అక్టోబరు 15(ప్రజా-క్షేత్రం):**








ప్రభుత్వ పాఠశాలలంటే సాధారణ భవనాలు.. పరిమిత సౌకర్యాలనే భావనను చెరిపేస్తూ అబ్దుల్లాపూర్మెట్ మండలం బండరావిరాల గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆదర్శంగా నిలుస్తోంది. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను తీర్చిదిద్దేందుకు ప్రత్యేక చొరవ తీసుకుంది. గ్రామ పాలకవర్గం కృషికి దాతల సహకారం తోడవడంతో పాఠశాలల రూపురేఖలు మారుతున్నాయి. రంగురంగుల గోడచిత్రాలు, విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించే బొమ్మలు, విద్యా సంబంధిత అంశాలతో బడులు ఆకర్షణీయంగా మారాయి.

**చదువుపై ఆసక్తి పెంచేలా గోడచిత్రాలు**

పాఠశాల భవనాలపై సైన్స్, గణితం, సాంకేతిక పరిజ్ఞానం, పుస్తక పఠనం తదితర అంశాలకు సంబంధించిన చిత్రాలను ఏర్పాటు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. ఆహ్లాదకరమైన వాతావరణంలో విద్యార్థులు చదువుపై మరింత ఆసక్తి పెంచుకునేలా ఈ మార్పులు దోహదపడనున్నాయి. పాఠశాలలు అందంగా ఉండటమే కాకుండా విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలకు ప్రేరణ కలిగించేలా సుందరీకరణ చేపట్టడం అభినందనీయం. ప్రభుత్వ పాఠశాలలపై తల్లిదండ్రులకు నమ్మకం పెంచడంతో పాటు, గ్రామీణ విద్యాభివృద్ధికి ఈ ప్రయత్నం తోడ్పడనుంది.

**పాలకవర్గం చొరవ.. దాతల సహకారం**

గ్రామంలో ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలనే లక్ష్యంతో సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ దూన శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు సమష్టిగా కృషి చేస్తున్నారు. పాఠశాలల అభివృద్ధికి దాతలను భాగస్వాములను చేయడం ద్వారా ప్రభుత్వ బడులను మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్దేందుకు ముందడుగు వేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఆర్ ఫౌండేషన్‌కు చెందిన బూడిద రామ్‌రెడ్డి, జగత్స్వప్న డెవలపర్స్‌కు చెందిన వంశీ, ఉదయ ఇండస్ట్రీస్‌కు చెందిన రంగారావు, బీఎస్ఆర్ ఇండస్ట్రీస్‌కు చెందిన బూడిద నందారెడ్డి, తెలంగాణ డెవలపర్స్‌కు చెందిన నర్సింహా యాదవ్, సప్తగిరి కన్స్ట్రక్షన్స్‌కు చెందిన జగన్, గ్రామ యువజన నాయకుడు గుండ్ల సతీష్ యాదవ్, తెలంగాణ డెవలపర్స్‌కు చెందిన బిక్షపతి యాదవ్ తమ వంతు సహకారం అందించారు. పాఠశాలల సుందరీకరణకు కాన్సెప్ట్, ఆర్ట్ రూపకల్పనలో నందిగామ గోవింద్ కీలక పాత్ర పోషించారు.

**ఇతర గ్రామాలకు ఆదర్శంగా ప్రభుత్వ బడులు**

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాకుండా, ప్రజాప్రతినిధులు, దాతలు, గ్రామస్థుల సమష్టి బాధ్యతగా భావించినప్పుడే మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయి. బండరావిరాలలో చేపట్టిన ఈ ప్రయత్నం అదే విషయాన్ని చాటిచెబుతోంది. గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీసుకొని ఇతర గ్రామాల పాలకవర్గాలు సైతం తమ పరిధిలోని బడులను సుందరీకరించేందుకు ముందుకు రావాల్సిన అవసరం ఉంది. ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు, ఆహ్లాదకరమైన వాతావరణం కల్పిస్తే విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మరింత అనుకూల పరిస్థితులు ఏర్పడతాయి.

**గ్రామ పాలకవర్గం:**

సర్పంచ్ కందికంటి విజయ్‌కుమార్, ఉపసర్పంచ్ దూన శంకర్ ముదిరాజ్, వార్డు సభ్యులు మహేష్ నేమురుగోముల, కొదాసు మణెమ్మ, కన్నె భరత్ యాదవ్, యడవెల్లి సుష్మిత గుప్త, ఏర్పుల హరికృష్ణ, కందికంటి అనూష, కొత్త అరుణ్‌కుమార్ గౌడ్, గుండ్ల భవాని ముదిరాజ్, కందికంటి నర్సింగ్‌రావు, పంచాయతీ కార్యదర్శి ఈర్లపల్లి శ్రీనివాస్, కారోబార్ ఏర్పుల శ్రీశైలం ఈ అభివృద్ధి కార్యక్రమంలో భాగస్వాములుగా ఉన్నారు.

# ప్రజలకు వైద్యం అందించే చేతులకు.. భరోసా కల్పించలేరా?

- **17 వేల ఎం హెచ్ ఎం ఉద్యోగుల గోడు ప్రభుత్వానికి వినిపించడం లేదా?**
- **ఏళ్ల తరబడి సేవలు.. నేటికీ కాంట్రాక్టు బతుకులేనా? | హామీలు కాదు.. హక్కులు కావాలి | ఉద్యోగుల ఆందోళనపై ప్రభుత్వ మౌనం వీడాలి**

**వికారాబాద్ బ్యూరో,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం ):**







ప్రజలకు వైద్యం అందించే ఉద్యోగుల జీవితాలే అభద్రతలో ఉంటే.. ప్రజారోగ్య వ్యవస్థ బలంగా ఉన్నట్టా? ప్రభుత్వ ఆసుపత్రుల్లో సేవలందిస్తూ, ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతలు నిర్వర్తిస్తున్న జాతీయ ఆరోగ్య మిషన్ ఉద్యోగులు తమ భవిష్యత్తు కోసం రోడ్డెక్కాల్సిన దుస్థితి ఎందుకు దాపురించింది? ఏళ్ల తరబడి సేవలందిస్తున్నా ఉద్యోగ భద్రతపై స్పష్టత లేకపోవడం, వేతనాలు, ఇతర ప్రయోజనాల కోసం ఆందోళన చేయాల్సి రావడం పాలకుల ఆలోచనా విధానానికే పరీక్ష. ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పించాల్సిన వ్యవస్థలో పనిచేసే సిబ్బందికి భరోసా కల్పించలేకపోవడం ఎంతవరకు సమంజసం?

**17 వేల మంది గొంతుక ప్రభుత్వానికి వినిపించడం లేదా?**

తెలంగాణలో సుమారు 17 వేల మంది ఎం హెచ్ ఎం ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణ అంశం మరోసారి చర్చనీయాంశమైంది. కాంట్రాక్టు విధానంలో పనిచేస్తున్న ఉద్యోగులు తమ సేవలకు తగిన గుర్తింపు, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, వార్షిక ఇంక్రిమెంట్లు, వైద్య సదుపాయాలు, ప్రసూతి సెలవులు వంటి ప్రయోజనాలను కోరుతున్నారు. ఇవి విలాసాలు కావు.. ఉద్యోగులు తమ జీవితాలను గౌరవంగా కొనసాగించేందుకు అవసరమైన అంశాలు. వారి ప్రతి డిమాండ్ చట్టపరంగా ఆమోదయోగ్యమా కాదా అనేది నిబంధనల ప్రకారం పరిశీలించవచ్చు. కానీ వారి సమస్యలను పట్టించుకోకుండా వదిలేయడం మాత్రం పరిష్కారం కాదు.

**సేవలు మాత్రం శాశ్వతం.. ఉద్యోగులు మాత్రం తాత్కాలికమా?**

ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాల అమలులో ఎం హెచ్ ఎం సిబ్బంది కీలక పాత్ర పోషిస్తున్నారు. తల్లి-శిశు ఆరోగ్యం నుంచి వ్యాధుల నివారణ వరకు, వైద్య పరీక్షల నుంచి ప్రజారోగ్య కార్యక్రమాల నిర్వహణ వరకు వారి సేవలు అవసరమవుతున్నాయి. ఇంతటి బాధ్యతలు నిర్వర్తించే ఉద్యోగుల భవిష్యత్తు మాత్రం కాంట్రాక్టు నిబంధనల మధ్యనే ఎందుకు ఊగిసలాడాలి? అవసరమైనప్పుడు వారి సేవలను వినియోగించుకుంటూ, వారి సమస్యల పరిష్కారానికి వచ్చేసరికి నిబంధనల పేరుతో జాప్యం చేయడం న్యాయమైన పాలనా విధానమా? ఉద్యోగుల కష్టాన్ని గుర్తించడం అంటే వేదికలపై ప్రశంసించడం కాదు.. వారి సమస్యలకు ఆచరణాత్మక పరిష్కారం చూపడం.

**క్రమబద్ధీకరణపై దాటవేత ధోరణి ఎందుకు?**

ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణకు నియామక నిబంధనలు, అర్హతలు, పోస్టుల మంజూరు, చట్టపరమైన పరిమితులు, ఆర్థిక భారం వంటి అంశాలు అడ్డంకులుగా ఉండవచ్చు. కానీ ఈ అంశాలపై సమగ్ర పరిశీలన జరిపి స్పష్టమైన నిర్ణయం ప్రకటించాల్సింది ప్రభుత్వమే. ఏ డిమాండ్ సాధ్యమో, ఏది సాధ్యం కాదో కారణాలతో సహా వెల్లడించాలి. సాధ్యమైన అంశాలపై అమలు గడువు ప్రకటించాలి. సాధ్యం కాని అంశాలపై ప్రత్యామ్నాయ ప్రయోజనాలను పరిశీలించాలి. సమస్యను పరిష్కరించే బదులు కాలయాపన చేస్తే ఉద్యోగుల్లో అసంతృప్తి మరింత పెరగడం సహజం.

**ధర్నాలు పెరిగితే నష్టపోయేది ఎవరు?**

ఉద్యోగులు నిరసన బాట పట్టడానికి ముందే వారి సమస్యలను పరిష్కరించే ప్రయత్నాలు జరిగి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేదా? ఉద్యోగ సంఘాలతో చర్చలు జరిపి, వారి డిమాండ్లను సమీక్షించి, పరిష్కార మార్గాలను అన్వేషించడం ప్రభుత్వ బాధ్యత. ఆందోళనలు సుదీర్ఘమైతే వాటి ప్రభావం ప్రజారోగ్య సేవలపై పడే ప్రమాదం ఉంది. అత్యవసర వైద్య సేవలు నిలిచిపోకుండా ఉద్యోగ సంఘాలు బాధ్యతగా వ్యవహరించాలి. అదే సమయంలో సేవలకు అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం ప్రభుత్వ బాధ్యత. ప్రజలను ఇబ్బందులకు గురిచేసే పరిస్థితి ఏర్పడకముందే చర్చల ద్వారా పరిష్కారం కనుగొనాలి.

**మద్దతు ప్రకటనలు సరిపోవు.. కార్యాచరణ ఏది?**

ఉద్యోగుల ఆందోళనలకు ప్రజాప్రతినిధులు సంఘీభావం ప్రకటించడం మంచిదే. కానీ సంఘీభావం సమస్యకు పరిష్కారం కాదు. సంబంధిత శాఖలతో చర్చించి, ఉద్యోగుల డిమాండ్లను ప్రభుత్వ స్థాయికి తీసుకెళ్లి, నిర్ణయం వచ్చేలా కృషి చేసినప్పుడే ఆ మద్దతుకు అర్థం ఉంటుంది. ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఉన్నతాధికారులు ఈ అంశంపై స్పష్టమైన వైఖరి ప్రకటించాలి. ఉద్యోగుల ప్రతినిధులతో అధికారిక చర్చలు జరిపి, తదుపరి చర్యలకు గడువు నిర్ణయించాలి. ప్రకటనల రాజకీయాలకు స్వస్తి పలికి, పరిష్కార రాజకీయాలకు తెరతీయాలి.

**జిల్లాల వారీ లెక్కలు వెల్లడించాలి**

రాష్ట్రంలోఎన్ హెచ్ ఎం కింద పనిచేస్తున్న ఉద్యోగుల సంఖ్య, వారి కేడర్లు, సర్వీసు కాలం, వేతనాలు, ఖాళీలు, సమ్మెలో పాల్గొంటున్న సిబ్బంది వివరాలను ప్రభుత్వం బహిర్గతం చేయాలి. ప్రతి జిల్లాలో ఎంతమంది ఉద్యోగులు పనిచేస్తున్నారు? ఏ విభాగంలో ఎన్ని పోస్టులున్నాయి? ఎంతమంది కాంట్రాక్టు విధానంలో ఉన్నారు? వారి డిమాండ్లపై ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకున్నారు? అనే ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాలి. ధృవీకరించిన గణాంకాలతో సమస్యను సమీక్షించి, జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు కార్యాచరణ రూపొందించాలి. లెక్కలు స్పష్టంగా ఉంటే బాధ్యత ఎవరిదో, పరిష్కారం ఎక్కడ ఆగిందో ప్రజలకు తెలుస్తుంది.

**ప్రభుత్వానికి సూటి ప్రశ్నలు**

ప్రజారోగ్య సేవలకు ఉద్యోగులు అవసరమైతే, వారి ఉద్యోగ భద్రతపై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం ఎందుకు? ఉద్యోగుల డిమాండ్లపై సమగ్ర సమీక్ష ఎప్పుడు? అధికారిక చర్చలకు తేదీ ఎప్పుడు ప్రకటిస్తారు? ప్రతి డిమాండ్‌పై నిర్ణయం తీసుకునే గడువు ఎప్పుడు వెల్లడిస్తారు? ఉద్యోగులకు వైద్య, సామాజిక భద్రత కల్పించడంపై ప్రభుత్వ విధానం ఏమిటి? ఇవి రాజకీయ ప్రశ్నలు కావు.. ప్రజలకు జవాబుదారీగా ఉండాల్సిన పాలనా వ్యవస్థను అడగాల్సిన ప్రశ్నలు.

**హామీలతో కాదు.. నిర్ణయాలతో నమ్మకం కల్పించాలి!**

ఎన్ హెచ్ ఎం ఉద్యోగుల సమస్యను ప్రభుత్వం ప్రతిష్ఠకు సంబంధించిన అంశంగా చూడకూడదు. ఉద్యోగ సంఘాలను ప్రత్యర్థులుగా కాకుండా ప్రజారోగ్య వ్యవస్థలో భాగస్వాములుగా చూడాలి. వారి డిమాండ్లపై చర్చలు జరిపి, చట్టపరమైన పరిధిలో సాధ్యమైన పరిష్కారాలను అమలు చేయాలి. ఉద్యోగుల సర్వీసుల క్రమబద్ధీకరణపై స్పష్టమైన వైఖరి ప్రకటించడంతో పాటు, వేతనాలు, ఇంక్రిమెంట్లు, వైద్య భద్రత, ప్రసూతి సెలవుల అంశాలపై నిర్ణయాత్మక చర్యలు చేపట్టాలి.

ప్రభుత్వం గుర్తుంచుకోవాల్సిన విషయం ఒక్కటే.. ప్రజారోగ్యం అనేది కేవలం ఆసుపత్రుల భవనాలు, పథకాల ప్రకటనలు, బడ్జెట్ కేటాయింపులతో బలోపేతం కాదు. ఆ సేవలను ప్రజలకు చేరవేసే ఉద్యోగుల నిబద్ధత, భద్రత, సంక్షేమంతోనే బలోపేతమవుతుంది.

17 వేల మంది ఉద్యోగుల సమస్యపై ఇకనైనా ప్రభుత్వం మౌనం వీడాలి. వారి డిమాండ్లను పరిశీలించి, పరిష్కారానికి స్పష్టమైన కాలపట్టిక ప్రకటించాలి. ప్రజలకు వైద్య భరోసా ఇచ్చే ఉద్యోగులకు ప్రభుత్వం భరోసా కల్పించాలి. ఉద్యోగుల గోడు వినిపించని పాలన ప్రజల ఆరోగ్య సమస్యలను ఎలా వినగలదు? ఈ ప్రశ్నకు ప్రభుత్వం తన చర్యలతోనే సమాధానం చెప్పాలి.

# మందకృష్ణ మాదిగతో బండమీది వెంకటేష్ ఆత్మీయ భేటీ

**శంకర్ పల్లి, అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**



ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మ శ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను బీసీ సంక్షేమ సంఘం చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు బండమీది వెంకటేష్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన మందకృష్ణ మాదిగతో భేటీ అయి పరస్పరం ఆత్మీయంగా మాట్లాడుకున్నారు. ముఖ్యంగా సామాజిక న్యాయం, అణగారిన వర్గాల అభ్యున్నతి, బడుగు బలహీన వర్గాల హక్కుల సాధన కోసం వివిధ సంఘాలు చేస్తున్న కృషి ప్రాధాన్యతను ఈ భేటీ సందర్భంగా చర్చించినట్లు తెలిపారు. సమాజంలో అన్ని వర్గాలకు సముచిత గౌరవం, సమాన అవకాశాలు లభించేలా ఐక్యంగా కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు.

# కోటగిరిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

**కోటగిరి అక్టోబర్ 15 (ప్రజా-క్షేత్రం):**



కోటగిరి మండల కేంద్రంలో బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ బర్ల మధుకర్ బతుకమ్మ సంబరాల సందర్భంగా స్థానిక చెరువు వద్ద ఏర్పాట్లు చేయించి పర్యవేక్షించారు. బతుకమ్మ పండుగ సందర్భంగా గ్రామంలోని మహిళలంతా రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి బతుకమ్మ ఆడారు. మహిళలు యువతుల కోలాటం బతుకమ్మ ఆటపాటలు ఆకట్టుకున్నాయి. మహిళలతో కలిసి సర్పంచ్ బర్ల మధుకర్, సెక్రటరీ సందీప్ బతుకమ్మ ఆడారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేసి సర్పంచ్ బర్ల మధుకర్, సెక్రెటరీ సందీప్ దగ్గరుండి పర్యవేక్షించారు.

# గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిపై బీజేపీలో ఉత్కంఠ!

- **రామచంద్రరావు తర్వాత ఎవరికి అవకాశం?**
- **రేసులో నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి పలువురు నేతల పేర్లతో రాజకీయ వేడి**
- **హైదరాబాద్–రంగారెడ్డి–మహబూబ్‌నగర్ స్థానంపై పార్టీ కసరత్తు**
- **ఆశావహుల బలాబలాలపై అంతర్గత చర్చ**
- **తుది నిర్ణయం అధిష్ఠానం చేతుల్లోనే!**

**వికారాబాద్ బ్యూరో,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థిత్వం బీజేపీలో ఆసక్తికర రాజకీయ చర్చకు తెరలేపుతోంది. ప్రస్తుత రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు పోటీ చేస్తారా? ఆయనకు అవకాశం దక్కని పక్షంలో మరెవరిని బరిలోకి దింపుతారు? పార్టీ సీనియర్లకు ప్రాధాన్యమిస్తారా? లేక ఉపాధ్యాయులు, ఉద్యోగులు, యువత, గ్రాడ్యుయేట్లలో పరిచయాలు ఉన్న నాయకుడికి అవకాశమిస్తారా? అనే ప్రశ్నలు పార్టీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ముఖ్యంగా నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి పేరు తెరపైకి రావడంతో అభ్యర్థిత్వంపై ఉత్కంఠ మరింత పెరిగినట్లు తెలుస్తోంది. అయితే ఈ పేర్లపై జరుగుతున్న చర్చకు, పార్టీ అధికారిక నిర్ణయానికి మధ్య తేడా ఉందని గుర్తించాల్సి ఉంది.

**అభిప్రాయ సేకరణతో అభ్యర్థిపై కసరత్తు**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి అభ్యర్థిని ఎంపిక చేసే ప్రక్రియలో భాగంగా ముగ్గురు సభ్యులతో కూడిన కమిటీ నియోజకవర్గ పరిధిలోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా అధ్యక్షులు, మాజీ అధ్యక్షులు, జిల్లా ఇన్‌చార్జుల అభిప్రాయాలు సేకరించినట్లు సమాచారం. ఈ అభిప్రాయ సేకరణలో ఎవరికి ఎంత మద్దతు లభించింది? పార్టీ నాయకత్వం ముందు ఎలాంటి పేర్లు ప్రతిపాదనకు వచ్చాయి? ఎవరికి క్షేత్రస్థాయిలో అనుకూలత ఉందనే అంశాలపై చర్చ సాగుతున్నట్లు తెలుస్తోంది. అయితే అభిప్రాయ సేకరణ ఫలితాలు, అభ్యర్థుల ప్రాధాన్య క్రమంపై అధికారిక సమాచారం అందుబాటులో లేదు.

**రామచంద్రరావు పోటీపై ఉత్కంఠ**

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు ఈ స్థానం నుంచి పోటీ చేస్తారా లేదా అన్నదే ప్రస్తుతం ప్రధాన ప్రశ్నగా మారింది. ఆయన బరిలో ఉంటే ఇతర ఆశావహుల అవకాశాలపై ప్రభావం పడవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఆయన పోటీ చేయని పరిస్థితి ఏర్పడితే పార్టీ అనుభవం, సంస్థాగత అనుబంధం, సామాజిక వర్గాల్లో గుర్తింపు, గ్రాడ్యుయేట్లతో సంబంధాలను పరిగణనలోకి తీసుకుని ప్రత్యామ్నాయ అభ్యర్థిని ఎంపిక చేసే అవకాశం ఉందనే చర్చ జరుగుతోంది. అయితే రామచంద్రరావు పోటీపై తుది నిర్ణయం తీసుకున్నట్లు అధికారిక ప్రకటన వెలువడలేదు.

**నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డి పేరు ఎందుకు చర్చలోకి?**

రామచంద్రరావు పోటీ చేయని పక్షంలో నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డికి అవకాశం దక్కవచ్చనే అభిప్రాయాలు పార్టీ వర్గాల్లో వ్యక్తమవుతున్నట్లు సమాచారం. ఆయనకు గతంలో రెండుసార్లు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేసిన అనుభవం ఉందని చెబుతున్నారు. ఉపాధ్యాయులు, ఉద్యోగ సంఘాలు, ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలతో పరిచయాలు, హైదరాబాద్-రంగారెడ్డి-మహబూబ్‌నగర్ ప్రాంతాల్లో ఉన్న గుర్తింపు ఆయనకు అనుకూల అంశాలుగా చర్చకు వస్తున్నాయి.

ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్, బీజేపీ భావజాలంతో సుదీర్ఘకాలంగా కొనసాగిన అనుబంధం, పార్టీ నాయకులు-కార్యకర్తలతో సంబంధాలు కూడా ఆయన పేరును పరిశీలనలోకి తీసుకురావడానికి కారణాలుగా పేర్కొంటున్నారు. యువత, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, గ్రాడ్యుయేట్ల సమస్యలపై పనిచేసిన అనుభవం ఎన్నికల ప్రచారంలో ఉపయోగపడవచ్చనే అంచనాలు వినిపిస్తున్నాయి. అయితే ఈ అంశాలన్నీ అభ్యర్థిత్వానికి అనుకూలంగా జరుగుతున్న చర్చలో భాగమే తప్ప, ఆయనకే టికెట్ ఖరారైందని చెప్పడానికి ప్రస్తుతం అధికారిక ఆధారాలు లేవు.





**ఆశావహుల జాబితాలో మరికొందరు నేతలు**

నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డితో పాటు ఎస్. మల్లారెడ్డి, ఎన్వీ సుభాష్, డోకూర్ పవన్, సారంగుల, అమర్‌నాథ్, గౌతమ్‌రావు, వీరేందర్ గౌడ్ తదితరుల పేర్లు కూడా ఆశావహులుగా వినిపిస్తున్నాయి. వీరిలో ఎవరికి పార్టీ నాయకత్వం నుంచి మద్దతు లభిస్తుంది? ఎవరి రాజకీయ అనుభవం, సంస్థాగత సేవలు, నియోజకవర్గ పరిధిలో పరిచయాలు ఎంపికకు దోహదపడతాయి? అనే అంశాలపై పార్టీ శ్రేణుల్లో చర్చ సాగుతోంది. అయితే ఈ పేర్లన్నీ అధికారికంగా ఖరారైన అభ్యర్థుల జాబితాలో ఉన్నాయని భావించడానికి ఆధారాలు లేవు.

**గ్రాడ్యుయేట్ల సమస్యలే ఎంపికలో కీలకమా?**

గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ బలం మాత్రమే కాకుండా ఓటర్లతో అభ్యర్థికి ఉన్న ప్రత్యక్ష సంబంధాలు కూడా ప్రాధాన్యం సంతరించుకుంటాయి. నిరుద్యోగ యువత సమస్యలు, ఉద్యోగ అవకాశాలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, ఉపాధ్యాయుల సమస్యలు, ప్రైవేట్ విద్యా సంస్థల పరిస్థితులు, విద్యావంతుల హక్కులపై అభ్యర్థి వైఖరి కీలకంగా మారవచ్చు. అందువల్ల పార్టీతో సుదీర్ఘ అనుబంధం ఉన్న నాయకుడిని ఎంపిక చేయాలా? లేక గ్రాడ్యుయేట్లు, ఉద్యోగులు, ఉపాధ్యాయుల్లో విస్తృత పరిచయాలు ఉన్న వ్యక్తికి ప్రాధాన్యం ఇవ్వాలా? అనే అంశం అధిష్ఠానం ముందున్న ప్రధాన పరిశీలనల్లో ఒకటిగా ఉండవచ్చని రాజకీయ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

**అధిష్ఠానం నిర్ణయమే ఫైనల్**

అభ్యర్థిత్వంపై జరుగుతున్న చర్చలు, ఆశావహుల పేర్లు, నేతల మధ్య ఉన్న పోటీ ఎలా ఉన్నప్పటికీ తుది నిర్ణయం బీజేపీ అధిష్ఠానానిదే. పార్టీ రాష్ట్ర నాయకత్వం నుంచి అందే అభిప్రాయాలు, నియోజకవర్గ స్థాయి నివేదికలు, అభ్యర్థుల రాజకీయ నేపథ్యం, ఎన్నికల్లో గెలుపు అవకాశాలు తదితర అంశాలను పరిశీలించిన తర్వాతే నిర్ణయం వెలువడే అవకాశం ఉంది. ప్రస్తుతం రామచంద్రరావు పోటీపై స్పష్టత లేకపోవడం, ప్రత్యామ్నాయంగా పలువురి పేర్లు వినిపిస్తుండటంతో ఈ ఎమ్మెల్సీ స్థానం బీజేపీ రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది.

**ఎవరికి దక్కనుంది అదృష్టం?**

రామచంద్రరావే బరిలోకి దిగుతారా? నెల్లి శ్రీవర్ధన్‌రెడ్డికి అవకాశం లభిస్తుందా? లేక ఇతర ఆశావహుల్లో ఎవరికైనా పార్టీ పగ్గాలు అప్పగిస్తారా? అన్నది తేలాల్సి ఉంది. అధికారిక ప్రకటన వచ్చే వరకు ఏ ఒక్కరి పేరునూ ఖరారైన అభ్యర్థిగా పరిగణించలేం. అభ్యర్థి ఎంపికపై కొనసాగుతున్న కసరత్తు ముగిసి అధిష్ఠానం నిర్ణయం వెలువడిన తర్వాతే బీజేపీ వ్యూహంపై స్పష్టత రానుంది.



# దేవాలయ అభివృద్ధికి కొత్త బాట.

- **వ్యాపార సముదాయాలు ప్రారంభం**
- **శ్రీ సద్గురు పోట్లి మహారాజ్ దేవాలయ ఆదాయం రూ.4 లక్షల నుంచి రూ.40 లక్షలకు పెరిగింది**
- **ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి.**

**తాండూరు,అక్టోబర్15, (ప్రజాక్షేత్రం):**

దేవాలయ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ఆలయ ఆదాయాన్ని పెంచి భక్తులకు మరిన్ని సౌకర్యాలు కల్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి తెలిపారు. తాండూరు పట్టణంలోని శ్రీ సద్గురు పోట్లి మహారాజ్ దేవాలయ నూతన వ్యాపార సముదాయ కాంప్లెక్స్‌లను గురువారం ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో దేవాలయ ఖాతాలో కేవలం రూ.4 లక్షలు మాత్రమే ఉండగా, ప్రస్తుతం ఆ మొత్తం రూ.40 లక్షలకు చేరుకుందని తెలిపారు. దేవాలయ ఆదాయాన్ని మరింత పెంచుతూ, ఆ నిధులను ఆలయ అభివృద్ధి పనులకు వినియోగించుకోవడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ట్రాఫిక్ సమస్యలకు తావులేకుండా నిర్మాణం దేవాలయానికి వచ్చే భక్తులు, వ్యాపారులు, పట్టణ ప్రజలకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ముందస్తు ప్రణాళికతో నూతన వ్యాపార సముదాయాన్ని నిర్మించినట్లు ఎమ్మెల్యే వివరించారు. షాపుల నిర్మాణం, కేటాయింపుల విషయంలో పారదర్శకతకు ప్రాధాన్యతనిచ్చామని, ప్రతి పనిలో జవాబుదారీతనంతో వ్యవహరిస్తున్నామని స్పష్టం చేశారు.

ఆలయ అభివృద్ధికి సమష్టి కృషి అవసరం శ్రీ సద్గురు పోట్లి మహారాజ్ దేవాలయాన్ని ఆధ్యాత్మికంగా, ఆర్థికంగా మరింత అభివృద్ధి చేసేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఆలయ ప్రాంగణంలో శివాలయం, దాసోహం, రాజగోపురం నిర్మాణ పనులు చేపడుతున్న వారిని ఈ సందర్భంగా అభినందించారు. ఆలయ అభివృద్ధితో పాటు భక్తులకు అవసరమైన సౌకర్యాలను మెరుగుపరిచేందుకు సమష్టిగా కృషి చేయాలని సూచించారు. దేవాలయానికి వచ్చే ఆదాయాన్ని సద్వినియోగం చేసుకుంటూ, భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ప్రసాద్ గౌడ్, డైరెక్టర్ నవీన్ గౌడ్ పలువురు ప్రజాప్రతినిధులు, ఆధ్యాత్మిక వేత్తలు, నాయకులు పాల్గొన్నారు.



# రాక్షసులుగా మారిన రక్షకులు.

- **- జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం కాకి శాఖకు మాయని మచ్చ**
- **బాధిత జర్నలిస్టులను పరామర్శించిన టిఆర్పీ నేతలు**
- **ఎస్ఐ శ్రీకాంత్‌ను శాశ్వతంగా విధుల నుంచి తొలగించాలి**
- **విచారణ జరిపి సీఐ, డీఎస్పీలను సస్పెండ్ చేయాలని టిఆర్పీ డిమాండ్.**
- **టీఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా.**

**కరీంనగర్, అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

విధి నిర్వహణలో భాగంగా ప్రజా సమస్యలను వెలుగులోకి తెస్తూ, ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేస్తున్న జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసి థర్డ్ డిగ్రీ చేయడం ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టులాంటిదని తెలంగాణ రాజ్యాధికార పార్టీ (టీఆర్పీ) రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ అఖిల్ పాషా అన్నాడు. సిరిసిల్ల జిల్లా గంబిరావుపేట ఎస్సై శ్రీకాంత్ చేసిన థర్డ్ డిగ్రీ లో గాయపడిన బాధిత జర్నలిస్టులు రాతిపెల్లి సంపత్, శేకర్లను టీఆర్పీ నాయకులతో కలిసి ఆయన పరామర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకుని, వారికి ధైర్యం చెప్పారు. బాధిత జర్నలిస్టులకు పార్టీ తరఫున అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. అనంతరం టిఆర్పీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మీడియాతో మాట్లాడుతూ ప్రజల సమస్యలను వెలుగులోకి తీసుకొస్తూ, అధికారులను ప్రశ్నించే జర్నలిస్టులపై థర్డ్ డిగ్రీ ప్రయోగించడం అత్యంత హేయమైన చర్య అని తీవ్రంగా మండిపడ్డారు. చట్టాన్ని కాపాడాల్సిన పోలీసులే చట్టవిరుద్ధ చర్యలకు పాల్పడడం సిగ్గుచేటని, ఇలాంటి ఘటనలు పోలీసు వ్యవస్థపై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని అన్నారు. ఈ నెల 12వ తేదీ రాత్రి 10 గంటల సమయంలో జర్నలిస్టులు రాతిపెల్లి సంపత్, శేకర్లను కరీంనగర్ పట్టణ కేంద్రంలో అరెస్టు చేసి గంభీరావుపేట పోలీస్ స్టేషన్‌కు తరలించిన అనంతరం ఎస్ఐ శ్రీకాంత్ థర్డ్ డిగ్రీ ప్రయోగించినట్లు బాధితులు తెలిపారని పేర్కొన్నారు. ఎస్సై థర్డ్ డిగ్రీ చేస్తూ సిఐ మరియు డిఎస్పీలకు వీడియో కాల్ చేసి చేయిస్తూ వారిని ఆమెకు దుర్భాశలాడుతూ కర్కశంగా ప్రవర్తించారని తెలిపారని అన్నారు. వార్తలు రాస్తే కక్ష సాధింపులా, పోలీసులను ప్రశ్నిస్తే థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తారా, ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే గొంతుకలను అణచివేయాలని చూస్తే సహించేది లేదని అఖిల్ పాషా హెచ్చరించారు. అనేక అవినీతి ఆరోపణలు ఉన్న ఎస్సై శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదును సిఐ వెంకటేష్ మరియు డిఎస్పీ పరిశీలించకుండా ఎస్సై పాల్పడ్డ ఘటనకు సహకరించిన పోలీసు ఉన్నతాధికారులు సిఐ డిఎస్పీలపై జిల్లా ఎస్పీ నిష్పక్షపాత విచారణ జరిపించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్ఐ శ్రీకాంత్‌ను ఈ రోజు ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసినట్టు తెలిసిందని అటాచ్ చేయడం మాత్రమే సరిపోదని, శాశ్వతంగా సర్వీస్ ఫర్ రిమువల్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంలో బాధ్యత ఉన్నట్లు తేలితే సీఐ వెంకటేశ్, డీఎస్పీ నాగేంద్రచారిలను కూడా సస్పెండ్ చేయాలని కోరారు. బాధిత జర్నలిస్టులకు న్యాయం జరిగే వరకు టీఆర్పీ పోరాటం ఆగదని పోలీసు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి. లేనిపక్షంలో బాధిత జర్నలిస్టులకు న్యాయం కోసం ఆందోళన కార్యక్రమాలు చేపడతాం అని అఖిల్ పాషా స్పష్టం చేశారు. వారితో పాటు పార్టీ నాయకులు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ చాంద్ పాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి చిగుర్ల మోహన్, కొత్తపెల్లి మండల అధ్యక్షుడు ఓర్సు రాజు నాయకులు వెంకట్ గౌడ్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



# చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మిక తనిఖీ చేసిన పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం

- **రికార్డులు, లాకప్, పరిసరాలను పరిశీలించిన సీపీ**
- **సత్వర న్యాయం అందించాలని ఆదేశం**
- **కార్యక్రమంలో పాల్గొన్న సీఐ అనిల్, ఎస్సై జగదీశ్వర్**

**చిగురుమామిడి, అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం చిగురుమామిడి పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని జనరల్ డైరీ, ఎఫ్ఐఆర్ కాపీలు, పెండింగ్ కేసులు, రౌడీ షీటర్ల రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణ, రిసెప్షన్ కౌంటర్, లాకప్ రూమ్‌లను పరిశీలించి అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా సీపీ గౌష్ ఆలం మాట్లాడుతూ.. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, బాధితుల సమస్యలను శ్రద్ధగా విని వారికి త్వరితగతిన న్యాయం చేకూర్చాలని సిబ్బందిని ఆదేశించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి అలసత్వం వహించరాదని, గ్రామాల్లో నిరంతరం నిఘా ఉంచాలని స్పష్టం చేశారు. నేరాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో తిమ్మాపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ (సీఐ) అనిల్, చిగురుమామిడి సబ్‌ఇన్స్పెక్టర్ (ఎస్సై) జగదీశ్వర్ తో పాటు పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.




# స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన సర్పంచ్ రామిరెడ్డి

**కోటగిరి, అక్టోబర్ 14(ప్రజాక్షేత్రం):**

పోతంగల్ మండలం కల్లూరు గ్రామంలో సర్పంచ్ రామిరెడ్డి ఆధ్వర్యంలో గ్రామంలోని రేషన్ కార్డు లబ్ధిదారులకు బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. గ్రామంలోని తెల్ల రేషన్ కార్డుల లబ్ధిదారులకు రెవెన్యూ శాఖ ద్వారా వచ్చిన స్మార్ట్ రేషన్ కార్డులను గ్రామపంచాయతీలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ రామిరెడ్డి మాట్లాడుతూ... ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ప్రజలు తీసుకొని భద్రపరుచుకోవాలని ఇకపై ఈ స్మార్ట్ రేషన్ కార్డు ని అన్ని చోట్ల వినియోగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిపిఓ సాయిలు, సీనియర్ నాయకులు లింగప్ప,గ్రామ ప్రజలు లబ్ధిదారులు ఉన్నారు.



# భక్తిశ్రద్ధలతో శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవాలి

- **- రుద్రూర్ సీఐ కృష్ణ**
- **దుర్గామాత మండపాలను సందర్శించిన సీఐ కృష్ణ, ఎస్సై శ్రీనివాస్ యాదవ్**

**పోతంగల్ అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండల కేంద్రంలో గల బస్టాండ్ ప్రాంతంలో ప్రతిష్టాపించిన శ్రీ దుర్గా దేవి 21వ వార్షికోత్సవ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన నవగ్రహ పూజ హారతితో ఇచ్చి ప్రత్యేక పూజలు జరుపుతున్నారు. గురువారం రుద్రూర్ సీఐ కృష్ణ కోటగిరి, ఎస్సై శ్రీనివాస్ యాదవ్ కోటగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్ దుర్గామాత మండపాలను సందర్శించి అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం శ్రీ స్వామి వివేకానంద యూత్ ఆధ్వర్యంలో వారిని ఘనంగా సన్మానించి దేవి నవరాత్రులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రుద్రూర్ సీఐ కృష్ణ మీడియాతో మాట్లాడుతూ... పోతంగల్ మండల కేంద్రంలో ప్రతిష్టాపించిన శ్రీ దుర్గా దేవి 21వ వార్షికోత్సవ శరన్నవరాత్రి ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. ప్రతి సంవత్సరం నవరాత్రి ఉత్సవాలలో అఖండ హరినామ సప్తహ కార్యక్రమం ఏర్పాటుచేసి ప్రతి ఒక్కరిని భక్తి మార్గంలో తీసుకెళుతున్న శ్రీ స్వామి వివేకానంద యూత్ కమిటీని అభినందించారు.ప్రతి ఒక్కరూ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే శ్రీ స్వామి వివేకానంద యూత్ గౌరవ అధ్యక్షులు సితాలే మోహన్ మాట్లాడుతూ... ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం సైతం అంగరంగ వైభవంగా శ్రీ దుర్గా దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు జరుపుకోవడం జరుగుతుందన్నారు. ఈ నవరాత్రి ఉత్సవాలలో అఖండ హరినామ సప్తహ కార్యక్రమం ఏర్పాటు చేసి ప్రతిరోజు ప్రత్యేక ప్రవచన కర్తతో ప్రవచనాలు కీర్తనలు చెప్పడం జరుగుతుందని ఆయన పేర్కొన్నారు. అమ్మవారి కృపా కటాక్షాలు ప్రతి ఒక్కరిపై ఉండాలని కోరారు. ప్రతి రోజు జరిగే హరినామ సప్తహ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రుద్రూర్ సీఐ కృష్ణ, కోటగిరి ఎస్సై శ్రీనివాస్ యాదవ్, కోటగిరి మండల సర్పంచుల ఫోరం అధ్యక్షులు బర్ల మధుకర్, శ్రీ స్వామి వివేకానంద యూత్ అధ్యక్షులు సూదం భూమయ్య, ఉపాధ్యక్షులు దశరథ్, క్యాషియర్ మోహన్, వడ్ల దత్తు, రమేష్ గౌడ్, శివ గౌడ్, సాయినాథ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఎత్తొండ సొసైటీ చైర్మన్ కు ఎంఆర్పిఎస్ నాయకుల సన్మానం

**కోటగిరి అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

ఎత్తొండ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా ఇటీవల నియమితులైన కోనేరు వెంకట సుబ్బారావు ను ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో బాన్సువాడ నియోజకవర్గ ఇన్చార్జి సోంపూర్ పోచిరాం మాదిగ, జలయ్య మాదిగ ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు సంఘరి సాయిలు, నాగరాజు మాదిగలు గురువారం ఎత్తొండ సొసైటీలో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా పోచీరం మాదిగ మాట్లాడుతూ.... రైతులకు ఎరువులు, ఫర్టిలైజర్, అన్ని విధాల లోన్లు, సబ్సిడీ విత్తనాలు రైతులకు సకాలంలో అందించాలని రైతుల పక్షాన మంచి సేవలు అందించి పాలకవర్గానికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.





# మంగంపల్లి ఘటన నిందితులను వెంటనే అరెస్టు చేయాలి

- **జిల్లా కలెక్టర్‌కు మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి వినతి**

**వనపర్తి,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం)**

పెద్దమందడి మండలం మంగంపల్లి గ్రామంలో దళిత యువకుడిని అవమాన పరిచిన ఘటనపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి స్పందించారు. ఈ ఘటనకు బాధ్యులైన నిందితులను తక్షణమే అరెస్టు చేసి, న్యాయస్థానం ద్వారా జ్యుడీషియల్ రిమాండ్‌కు పంపించాలని డిమాండ్ చేశారు.

ఈ మేరకు గురువారం జిల్లా కలెక్టర్‌కు సమర్పించేందుకు పార్టీ ప్రతినిధుల ద్వారా వినతిపత్రం అందజేశారు. దళితులను అవమానపరిచిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, బాధితులకు న్యాయం జరిగేలా అధికారులు తక్షణమే స్పందించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు గట్టు యాదవ్, వాకిటి శ్రీధర్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, సూర్యవంశం గిరి,సయ్యద్ జమీల్ తదితరులు పాల్గొన్నారు.

# లలితా త్రిపురసుందరిగా అమ్మవారు

- **బండారు వారి వీధి, బసవన్నగడ్డలో వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు**

**వనపర్తి,అక్టోబరు 15 (ప్రజాక్షేత్రం):**

వనపర్తి జిల్లా కేంద్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఐదో రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపురసుందరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అర్చనలతో పూజా మండపాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

**బండారు వారి వీధిలో ప్రత్యేక పూజలు**

వనపర్తి పట్టణంలోని బండారు వారి వీధిలో జిల్లా మున్నూరు కాపు సంఘం, మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్రి ఉత్సవాల్లో ఐదో రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారిని లలితా త్రిపురసుందరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు.

భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ అన్నప్రసాద వితరణ చేపడుతున్నారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ వేడుకలు స్థానికుల్లో భక్తిభావాన్ని పెంపొందిస్తున్నాయి.

బసవన్నగడ్డలో కనులపండువగా వేడుకలు పట్టణంలోని 31 వ వార్డు బసవన్నగడ్డ శివాలయంలో స్థానిక మహిళల ఆధ్వర్యంలో జరుగుతున్న దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజు అమ్మవారిని శ్రీ లలితా త్రిపురసుందరి రూపంలో అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారి దివ్య స్వరూపాన్ని దర్శించుకున్న భక్తులు భక్తిపారవశ్యంలో మునిగిపోయారు. పూజా కార్యక్రమాలతో ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

**లలితా త్రిపురసుందరి ఆరాధనలో అంతరార్థం**

శ్రీ లలితా త్రిపురసుందరి దేవి ఆదిపరాశక్తి స్వరూపిణిగా, కరుణ, జ్ఞానం, సౌందర్యం, శక్తికి ప్రతీకగా ఆరాధించబడుతుంది. శ్రీవిద్యా సంప్రదాయంలో అమ్మవారికి విశిష్టమైన స్థానం ఉంది. లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, ప్రత్యేక పూజలు అమ్మవారి ఆరాధనలో ప్రాధాన్యం సంతరించుకున్నాయి.అమ్మవారిని ఈ రూపంలో పూజించడం వల్ల జ్ఞానం, ఐశ్వర్యం, సౌభాగ్యం, మనశ్శాంతి కలుగుతాయని భక్తుల విశ్వాసం. కుటుంబాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని, సమాజంలో ఐకమత్యం, సౌభ్రాతృత్వం పెంపొందాలని భక్తులు ప్రార్థిస్తున్నారు. బండారు వారి వీధి, బసవన్నగడ్డలో నిర్వహిస్తున్న ఉత్సవాలు పట్టణంలో ఆధ్యాత్మిక సందడిని నింపుతున్నాయి.



# రుద్ర కాలనీలో కమిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు చెయ్యాలి

- **ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కి వినతి**

**శంషాబాద్,అక్టోబర్15 (ప్రజాక్షేత్రం):**

శంషాబాద్ జిహెచ్ఎంసి పరిధిలోని రుద్ర కాలనీలో కమిటీ హాల్ నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతూ, రుద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. వై. ప్రణయ్ ఆధ్వర్యంలో కాలనీవాసులు గురువారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ ని కలిసి వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా అసోసియేషన్ సభ్యులు మాట్లాడుతూ...రుద్ర కాలనీలో కమిటీ హాల్ నిర్మాణం చాలా కాలంగా పెండింగ్‌లో ఉందని తెలిపారు. గతంలో స్థలం అందుబాటులో లేకపోవడంతో నిర్మాణం ఆపేసారు. ప్రస్తుతం కమిటీ హాల్ నిర్మాణానికి సంబంధించిన స్థలం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తయిందని పేర్కొన్నారు. కావున,కాలనీవాసుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని సంబంధిత స్థలంలో కమిటీ హాల్ నిర్మాణానికి అవసరమైన నిధులు మంజూరు చేసి, పనులను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యేను కోరినట్లు తెలిపారు.

కాలనీలో జరిగే సమావేశాలు, సామాజిక కార్యక్రమాలు, ఇతర ప్రజా అవసరాల కోసం కమిటీ హాల్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని వారు వివరించారు.

ఈ వినతిపై ఎమ్మెల్యే శ్రీ ప్రకాష్ గౌడ్ , సానుకూలంగా స్పందించి, కమిటీ హాల్ నిర్మాణానికి సంబంధించి త్వరలోనే తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ సంజయ్ యాదవ్, మాజీ ఎంపీటీసీ జ్ఞానేశ్వర్ యాదవ్,రుద్ర కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. వై. ప్రణయ్,ప్రధాన కార్యదర్శి బి. శ్రీకాంత్ యాదవ్,ఉపాధ్యక్షుడు ప్రసాద్ బాబు,పి. ప్రేమ్ కుమార్, బి. శ్రీకాంత్,సోహైల్,రాచమల్ల కిషోర్,జాన్,అనిల్,రాజు ,సుధీర్ బాబు,జాషువా పాల్,రాచమల్ల కిరణ్,ఇజ్రాయిల్, ప్రజమాన్,పవన్,రుద్రాక్ష తదితర అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# కుక్క కాటుకు చెప్పు దెబ్బ నేటి సమాజంలో లేదా?

- **కులం పేరుతో దూషణ చేసేంత ఇబ్బంది ఎవరికి ఉండొచ్చు**
- **అసలు ఈ సామెత నిజమేనా రాజకీయవేతల్లో మార్పు రాదా**
- **ఏమి ఇబ్బంది జరుగుతుందని టార్గెట్ చేస్తారు?**

**చేవెళ్ల అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల మండలంలోని గ్రామము ఖానాపూర్ పురాతన గుడి స్థలంలో వినాయక షెడ్ కట్టుకుందామని వాళ్లు మరమ్మత్తులు చేసుకుంటే అక్కడ అగ్రకులాలకు సంబంధించి భూమి ఉండడంతో సర్వేనెంబర్ 272 లోకి కట్టుకోండి అని యా మార్చారు అక్కడికి పోయేసరికి అగ్రకులాలకు చెందిన వినాయక షెడ్డు మరియు హనుమాన్ టెంపుల్ పల్లె ప్రకృతి వనం బీసీకి సంబంధించిన గుడి నిర్మాణం కూడా చేస్తున్నారు ఇది రాజకీయంతో చేసే స్వార్థం కాదా

**అల్లర్లు ఎవరికోసం సృష్టిస్తున్నారు?**

ఖానాపూర్ గ్రామం నందు ప్రతి ఒక్క కులానికి చెందిన వారందరూ ఐక్యమత్యంతో ఉన్న విషయం చేవెళ్ల మండలానికి తెలిసిన విషయం కానీ కొందరు అగ్రకులాలకు చెందిన రాజకీయ నాయకులు వారి స్వార్థం కోసం మాదిగలను విభజించి పాలిస్తున్నారు. ఇది నిజం కానీ రాజకీయ నాయకులు ఒప్పుకోరు

**ఆర్డీవో కు పిటిషన్ ఇవ్వవలసిన అవసరంఎందుకు వచ్చింది?**

అసలు వాళ్లను మనుషుల్లా చూస్తే కదా అందుకని ఇవ్వవలసి వచ్చింది వారి స్వార్థం కోసం వాళ్లను వాడుకుంటారు వారి లోపలనే చిచ్చు పెడతారు కచ్చితంగా చెప్పాలంటే రాజకీయం చేయడం తప్పితే వీళ్లకు మనుషుల పట్ల గౌరవం మానవత్వం లేదా ఉండి కూడా వారి పదవులు గౌరవం ముఖ్యం అనుకుంటున్నార వాళ్లకు వల్ల పదవులు గౌరవం తప్పిస్తే మనుషులపై రాజ్యాంగంపై గౌరవం అనేది లేదు అనేది స్పష్టంగా కనిపిస్తుంది

**వారి మధ్యలో ఉంటే ఇబ్బంది ఏంటి అసలు?**

వారి మధ్యలో ఉంటే మా మాట వినరేమో మా పనులు చేయరేమో బయటి ప్రపంచం వీరికి తెలిస్తే మా తప్పులను వేలెత్తి చూపిస్తారేమో అనే భయం కానీ సరిదిద్దేదెవరు ఎవ్వరినైనా మేము మా అధికారంతో మా ఊదాతో శాసిస్తామని అగ్రకులాలకు నా అహంకారం ఇది మార్చేవారు నేటి సమాజంలో లేర్ అనేది వాళ్ళ భ్రాంతి

**మరి ధైర్యం చేసి గేటు దాటారు మారుతుందా**



**ఖానాపూర్ వైఖరి?**

మారదనే చెప్పుకోవాలి మారుతున్నది మనుషులు కాదు మారనన్నది వాళ్ల బుద్ధి వాళ్ళ డబ్బు పిచ్చి మేమే ఎక్కువ వాళ్లు మాకెందుకు సరిపోరు మేం చెప్పే పనులు చేసే వారితో మాకేంటి పోలిక అనే అహంకారం.

# పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం!

- **కొత్తకోటలో స్మార్ట్ రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ**
- **పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పేదలకు ఒరిగిందేమీ లేదు.. ఎమ్మెల్యే జీఎంఆర్ విమర్శలు**

**కొత్తకోట,అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పేర్కొన్నారు.

కొత్తకోట మున్సిపాలిటీ కేంద్రంలోని ఆర్కే గార్డెన్స్‌లో కొత్తకోట మండలం, మున్సిపాలిటీ పరిధిలోని లబ్ధిదారులకు ఎమ్మెల్యే జీఎంఆర్ స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేయడంతో పాటు, సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన ఆర్థిక సాయం చెక్కులను పంపిణీ చేశారు.

**కాంగ్రెస్ ప్రభుత్వం.. హామీల అమలుకు కట్టుబడి ఉంది**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూనే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తోందని తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.2 లక్షల వరకు పంట రుణమాఫీ, రూ.500కే గ్యాస్ సిలిండర్, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.10 లక్షల ఆరోగ్యశ్రీ, సన్న బియ్యం పంపిణీ, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరు వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నామని వివరించారు.

ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల మంజూరులో ఎలాంటి పైరవీలకు తావు లేకుండా అర్హతే ప్రామాణికంగా తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. పేదలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

**కొత్తకోటలో 670 ఇందిరమ్మ ఇళ్లు**

కొత్తకోట నియోజకవర్గ పరిధిలో ఇందిరమ్మ ఇళ్ల మంజూరుపై ఎమ్మెల్యే వివరాలు వెల్లడిస్తూ.. కొత్తకోట మండలంలో 524 ఇళ్లు, కొత్తకోట పట్టణంలో 146 ఇళ్లు కలిపి మొదటి విడతలో మొత్తం 670 ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని తెలిపారు.

ప్రస్తుతం రెండో విడతలో గుడిసెల్లో నివసిస్తున్న పేద కుటుంబాలను గుర్తించి మరో 73 ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. వచ్చే ఏడాది మార్చిలో మూడో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వెల్లడించారు.

అర్హులైన నిరుపేదలకు సొంత ఇంటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ఉద్దేశమని తెలిపారు.

**రేషన్ కార్డు పేదల ఆత్మగౌరవానికి ప్రతీక**

రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా, అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలకు కీలకమైన గుర్తింపు పత్రంగా ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే జీఎంఆర్ అన్నారు. పేదల ఆత్మగౌరవానికి రేషన్ కార్డు ప్రతీక అని పేర్కొన్నారు.

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వడంలో గత ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. కొత్తకోట పట్టణంలో ఒక్క డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కూడా గత ప్రభుత్వం మంజూరు చేయలేదని ఆరోపించారు.

తెలంగాణలో తెల్ల రేషన్ కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ కోసం ప్రభుత్వం ఏడాదికి సుమారు రూ.13 వేల కోట్లు వెచ్చిస్తోందని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు.

**మహిళా సాధికారతకు పెద్దపీట**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం మహిళా సాధికారతకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని జీఎంఆర్ అన్నారు. రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోందని వివరించారు.



మహిళల సంక్షేమం, పేదల అభ్యున్నతి కోసం ప్రభుత్వం కృషి చేస్తుంటే ప్రతిపక్ష బీఆర్ఎస్ నాయకులు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. కేటీఆర్ వ్యాఖ్యలపై స్పందిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ప్రజలకు జరిగిన మేలు ఏమిటో ఆ పార్టీ నాయకులు సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.

బీఆర్ఎస్ పాలనలో ప్రజా సంక్షేమం కంటే నాయకుల వ్యక్తిగత ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇచ్చారని విమర్శించారు. బీఆర్ఎస్ తిరిగి అధికారంలోకి వస్తుందన్న ఆ పార్టీ నాయకుల ఆశలు నెరవేరవని వ్యాఖ్యానించారు.

**పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టుపై బీఆర్ఎస్‌కు ప్రశ్నలు**

కృష్ణా జలాల విషయంలో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఎమ్మెల్యే జీఎంఆర్ ఆరోపించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పదేళ్ల పాలనలోనే పూర్తి చేసి ఉంటే నేడు పాలమూరు జిల్లాలో సాగునీటి సమస్యలు ఇంత తీవ్రంగా ఉండేవి కావని అభిప్రాయపడ్డారు.

పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు కంటే ఆలస్యంగా ప్రారంభమైన కాళేశ్వరం ప్రాజెక్టుకు ప్రాధాన్యత ఇచ్చిన గత పాలకులు, పాలమూరు ప్రజల జీవనాడిగా భావించే ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేకపోయారని ప్రశ్నించారు.

అప్పటి సాగునీటి శాఖ మంత్రి హరీశ్‌రావు పాలమూరు ప్రాంత ప్రయోజనాల పరిరక్షణకు తగిన ప్రాధాన్యత ఇవ్వలేదని విమర్శించారు. ప్రాజెక్టును పూర్తి చేయాలని అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఒత్తిడి తీసుకురావడంలో పాలమూరు ప్రాంతానికి చెందిన మాజీ ఎమ్మెల్యేలు, మంత్రులు విఫలమయ్యారని ఆరోపించారు.

**ప్రజా సంక్షేమమే ధ్యేయం**

పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో జరగని అభివృద్ధిని కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసి చూపిస్తోందని ఎమ్మెల్యే జీఎంఆర్ పేర్కొన్నారు. పేదలకు ఇళ్లు, రేషన్ కార్డులు, వైద్య సహాయం అందించడంతో పాటు మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ప్రజా సంక్షేమం, మహిళా సాధికారత, అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని, భవిష్యత్తులోనూ ఆశీర్వదించాలని ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు కార్యకర్తలు యువకులు మహిళలు తదితరులు పాల్గొన్నారు

# క్రీడా పోటీలు ప్రారంభించిన ఎస్సై

**వలిగొండ,అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని వెలువర్తి గ్రామంలో వెలువర్తి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయదశమి సందర్భంగా నిర్వహిస్తున్న క్రీడోత్సవాలను గ్రామంలోని ప్రొఫెసర్ జయశంకర్ మినీ స్టేడియంలో గురువారం ప్రారంభించారు. క్రీడా ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా స్థానిక ఎస్సై ఏమిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి పాల్గొని క్రీడలను ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం,శారీరిక దారుఢ్యం ఏర్పడతాయని పోటీలలో గెలుపోటములు సహజమని ఓటమిలను విజయానికి మలుపుగా మలుచుకొని జీవితంలో ఎదగాలని ఆయన క్రీడాకారులకు సూచించారు. అనంతరం క్రీడాకారులతో పరిచయ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనితనర్సింగ్ యాదవ్,యూత్ అసోసియేషన్ అధ్యక్షులు కూచిమల్ల సుధాకర్,గ్రామ పంచాయతీ కార్యదర్శి గిరిబాబు,కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు ఉక్కుర్తి స్వామి,ఎడవెల్లి మల్లేశం, మాజీ అధ్యక్షులు బైరు సైదులు, కలుకూరి మహేష్,వర్కింగ్ ప్రెసిడెంట్లు నాగిళ్ళ రాము, బూడిద రాజు,ఉపాధ్యక్షులు పరకాల దశరథ, మల్లం ఉపేందర్,చెవ్వ పవన్, సూరబోయిన దయాకర్, కోశాధికారి మల్లం సాయి,ప్రధాన కార్యదర్శులు బోదాసు రాజు, క్రీడ కార్యదర్శులు పరకాల కిషోర్,మల్లం చంద్రమౌళి, ఎడవెల్లి వెంకటేశం,తక్కల్ల సురేష్,కార్యదర్శులు బద్దుల ప్రశాంత్,సలహాదారు ఇంజమూరి శేఖర్,ఎడవల్లి విజయ్,పిట్టల నరేష్,నిమ్మల శేఖర్,కూచిమల్ల రాము,యూత్ సభ్యులు,క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



# పెద్దేముల్ వీరాంజనేయ స్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

- **ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి**

**పెద్దేముల్,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

పెద్దేముల్ మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి దేవాలయంలో నిర్వహించిన ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య వైభవంగా జరిగింది.ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి స్థానిక నాయకులతో కలిసి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

ఆలయంలో వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొనగా,భక్తులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని దర్శించుకున్నారు.ధార్మిక కార్యక్రమాలు సమాజంలో ఆధ్యాత్మిక చింతనను పెంపొందించడంతో పాటు ప్రజల్లో ఐక్యత, సోదరభావాన్ని బలోపేతం చేస్తాయని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి,ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకు స్థానికుల సహకారం ఎంతో ముఖ్యమని తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు,ఆలయ కమిటీ పెద్దలు,సభ్యులు,గ్రామస్థులు,భక్తులు తదితరులు పాల్గొన్నారు.



# భూ భారతి.. రైతుకు భరోసా ఏదీ?

- భూమి రైతుది.. తిప్పలు రైతువి.. బాధ్యత ప్రభుత్వానిదే!
- సర్వర్ సమస్యలతో సతమతం.. రికార్డుల సవరణకు అంతులేని నిరీక్షణ
- భూమి హక్కుల కోసం కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. డిజిటల్ పాలనలోనూ తప్పని అగచాట్లు
- పెండింగ్ దరఖాస్తులెన్ని? పరిష్కారానికి గడువెప్పుడు? ప్రభుత్వమే సమాధానం చెప్పాలి
- సాంకేతికత పేరుతో రైతును నిరీక్షణలో పెట్టొద్దు.. హామీలు కాదు, క్షేత్రస్థాయిలో ఫలితాలు కావాలి!

రైతు తన భూమి హక్కును నిర్ధారించుకోవడానికి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడుతోంది? భూమి రికార్డుల్లో తప్పులను సరిచేయించుకోవడానికి, వారసత్వ భూమిని తన పేరుపై నమోదు చేసుకోవడానికి, పట్టాదారు పాస్‌బుక్ సమస్యను పరిష్కరించుకోవడానికి అన్నదాత ఎందుకు నిరీక్షించాలి? ప్రజలకు ప్రభుత్వ సేవలను సులభతరం చేయాల్సిన డిజిటల్ వ్యవస్థే సాంకేతిక సమస్యలతో ఇబ్బందులు సృష్టిస్తే బాధ్యత ఎవరిది? భూ భారతి అమలుపై రైతుల నుంచి వస్తున్న ఫిర్యాదులు ఈ ప్రశ్నలను ముందుకు తెస్తున్నాయి. భూమి రికార్డుల నిర్వహణలో పారదర్శకత, వేగం, జవాబుదారీతనం అత్యవసరం. అయితే ఈ వ్యవస్థ పనితీరును అంచనా వేయడానికి ప్రభుత్వ ప్రకటనలు మాత్రమే సరిపోవు. రైతు దరఖాస్తు ఎప్పుడు పరిష్కారమైంది? అతని సమస్యకు ఎలాంటి సమాధానం లభించింది? ఎన్ని రోజులు పట్టింది? ఈ ప్రశ్నలకు సమాధానాలే ప్రభుత్వ పనితీరుకు అసలైన కొలమానం.

భూమి అనేది రైతుకు కేవలం ఆస్తి కాదు. అది కుటుంబానికి జీవనాధారం, వ్యవసాయానికి పునాది, భవిష్యత్తుపై భరోసా. భూమిపై హక్కుకు సంబంధించిన రికార్డులో చిన్న పొరపాటు ఉన్నా దాని సవరణ రైతుకు అత్యవసరమవుతుంది. అలాంటి సమయంలో దరఖాస్తు ప్రక్రియ సజావుగా సాగకపోతే, సర్వర్ సమస్యలతో సేవలు నిలిచిపోతే, అధికారుల పరిశీలనలో జాప్యం జరిగితే రైతు సమయం, డబ్బు, శ్రమ వృథా కావచ్చు. ఈ సమస్యలను కేవలం సాంకేతిక లోపాలుగా చూడటం సరిపోదు. ప్రజలకు సేవలు అందించాల్సిన వ్యవస్థ ఎంత సమర్థంగా పనిచేస్తోందన్న దృష్టితో ప్రభుత్వం పరిశీలించాలి.

**భూ భారతి లక్ష్యం గొప్పదైతే.. అమలూ అదే స్థాయిలో ఉండాలి!**

భూ రికార్డుల సమస్యలకు పరిష్కారం చూపడం, భూమి వివరాలను పారదర్శకంగా నిర్వహించడం, ప్రజలకు సేవలను సులభతరం చేయడం ఏ ప్రభుత్వానికైనా ముఖ్యమైన బాధ్యత. ఈ లక్ష్యంతో ప్రవేశపెట్టిన భూ భారతి వ్యవస్థ రైతుకు ఉపశమనం కలిగించాలి. దరఖాస్తు చేయడం నుంచి సమస్య పరిష్కారం వరకు ప్రతి దశ స్పష్టంగా ఉండాలి. అయితే సాంకేతిక సమస్యలు, దరఖాస్తుల స్థితిపై స్పష్టత లేకపోవడం, పరిష్కారానికి పట్టే సమయంపై అనిశ్చితి వంటి అంశాలపై ఫిర్యాదులు వస్తే ప్రభుత్వం వాటిని తేలికగా తీసుకోకూడదు.

ఒక పోర్టల్‌ను ప్రారంభించడం పాలనా సంస్కరణలో మొదటి అడుగు మాత్రమే. అది నిరంతరం పనిచేసేలా చూడటం, దరఖాస్తులను సకాలంలో పరిష్కరించడం, రైతులకు అవసరమైన సమాచారం అందించడం, ఫిర్యాదులపై చర్యలు తీసుకోవడం అసలు పరీక్ష. ఆన్‌లైన్ సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పడం కంటే, అవి రైతుకు ఎంతవరకు ఉపయోగపడుతున్నాయో నిర్ధారించడం ముఖ్యం. సాంకేతిక వ్యవస్థలో లోపాలు ఎదురైనప్పుడు ప్రత్యామ్నాయ మార్గం లేకపోతే డిజిటల్ సౌకర్యం ఉన్నా ప్రజలకు ప్రయోజనం అందదు.

ప్రభుత్వం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ప్రజల కోసం ఏర్పాటు చేసిన వ్యవస్థ ప్రజలకు అందుబాటులో ఉండాలి. సాంకేతిక పరిజ్ఞానం లేని రైతు కూడా తన సమస్యను సులభంగా తెలియజేసి పరిష్కారం పొందగలగాలి. కంప్యూటర్, ఇంటర్నెట్, ఆన్‌లైన్ దరఖాస్తుల ప్రక్రియపై అవగాహన తక్కువగా ఉన్నవారికి సహాయం అందించాలి. డిజిటల్ పాలన పేరుతో బాధ్యతను రైతుపైనే మోపడం సరికాదు.

**సర్వర్ బిజీ.. రైతు జీవితం మాత్రం ఆగదు!**

రైతుకు వ్యవసాయ పనులే కాదు, కుటుంబ బాధ్యతలు, పంట పెట్టుబడులు, రుణాలు, ఇతర అవసరాలు ఉంటాయి. భూమి రికార్డులకు సంబంధించిన పని కోసం ఒకరోజు కార్యాలయానికి వెళ్లడం, తిరిగి రావడం, అవసరమైన పత్రాలు సేకరించడం అతనికి అదనపు భారమే. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయడానికి ప్రయత్నించినప్పుడు సర్వర్ పనిచేయకపోతే, వివరాలు నమోదు కాకపోతే, చెల్లింపు ప్రక్రియలో ఆటంకం ఏర్పడితే మళ్లీ ప్రయత్నించాల్సి రావచ్చు. సమస్య పరిష్కారం కాకపోతే సహాయం కోసం మరో కార్యాలయాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

సాంకేతిక సమస్యలు ఏ వ్యవస్థలోనైనా తలెత్తవచ్చు. కానీ అవి పునరావృతమైనప్పుడు వాటి మూలకారణాన్ని గుర్తించి పరిష్కరించడం పాలనా బాధ్యత. సర్వర్ సామర్థ్యం సరిపోతుందా? వినియోగదారుల సంఖ్యకు అనుగుణంగా సదుపాయాలు ఉన్నాయా? చెల్లింపులు, పత్రాల అప్‌లోడ్, స్లాట్ బుకింగ్ వంటి సేవల్లో ఎక్కడ ఎక్కువ ఆటంకాలు వస్తున్నాయి? సమస్య తలెత్తినప్పుడు దాన్ని పరిష్కరించేందుకు సాంకేతిక బృందం ఎంత త్వరగా స్పందిస్తోంది? ఈ అంశాలపై ప్రభుత్వం సమగ్ర సమీక్ష నిర్వహించాలి.

ఒకసారి ప్రయత్నించండి, మరోసారి ప్రయత్నించండి అంటూ రైతును నిరీక్షణలో ఉంచడం పరిష్కారం కాదు. సమస్య ఎక్కడ ఉందో గుర్తించి, ఎప్పటిలోగా సరిచేస్తారో తెలియజేయాలి. దరఖాస్తు పూర్తికాకపోయినా రైతు సమర్పించిన వివరాలు నష్టపోకుండా చూడాలి. చెల్లింపు జరిగి సేవ పూర్తికాని సందర్భాల్లో ఫిర్యాదు చేసే విధానం స్పష్టంగా ఉండాలి. రైతుకు ప్రతి దశలో సమాచారం అందాలి. అదే బాధ్యతాయుతమైన డిజిటల్ సేవ.

**భూమి రికార్డుల్లో తప్పు.. సరిచేసే బాధ్యత ఎవరిది?**

భూమి విస్తీర్ణం, సర్వే నంబరు, యజమాని పేరు, వారసత్వ వివరాలు వంటి అంశాల్లో పొరపాట్లు ఉంటే వాటిని సరిచేసుకోవడం రైతుకు కీలకమైన పని. భూమి రికార్డుల్లోని తప్పులు కొన్ని సందర్భాల్లో పాత పత్రాలు, వారసత్వ వివాదాలు, సర్వే వివరాల వ్యత్యాసాలు, గతంలో జరిగిన నమోదు లోపాల వల్ల ఏర్పడవచ్చు. ప్రతి సమస్యకు ఒకే పరిష్కారం ఉండదు. అందుకే దరఖాస్తును పరిశీలించి, సంబంధిత ఆధారాలను ధృవీకరించి, చట్టప్రకారం నిర్ణయం తీసుకోవాలి.

కానీ రైతుకు ఏ పత్రం కావాలో స్పష్టంగా చెప్పకపోతే, దరఖాస్తులో లోపం ఏమిటో తెలియజేయకపోతే, తదుపరి చర్య ఏమిటో వివరించకపోతే సమస్య మరింత క్లిష్టమవుతుంది. ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి పంపించడం, ఒక పత్రం కోసం పలుమార్లు తిరగాల్సి రావడం, దరఖాస్తు స్థితిపై సమాచారం అందకపోవడం వంటి పరిస్థితులు ప్రజల్లో అసంతృప్తిని పెంచుతాయి.

అందుకే ప్రతి దరఖాస్తుకు ప్రత్యేక గుర్తింపు సంఖ్య ఇవ్వాలి. దాని ప్రస్తుత స్థితి, బాధ్యత వహించే కార్యాలయం, పెండింగ్‌లో ఉండటానికి కారణం, తదుపరి చర్యల వివరాలు రైతుకు అందుబాటులో ఉండాలి. దరఖాస్తు తిరస్కరించాల్సి వస్తే కారణాలను రాతపూర్వకంగా తెలియజేయాలి. చట్టపరమైన వివాదం ఉన్న సందర్భాల్లో సంబంధిత న్యాయ ప్రక్రియను స్పష్టంగా వివరించాలి. రైతు సమస్యను అర్థం చేసుకుని పరిష్కార మార్గాన్ని చూపడం పరిపాలన ధర్మం.

**వారసత్వ భూములపై నిరీక్షణ.. కుటుంబాలకు ఇబ్బందులు**

తల్లిదండ్రుల నుంచి పిల్లలకు వారసత్వంగా భూమి సంక్రమించినప్పుడు రికార్డుల్లో పేర్ల మార్పు, మ్యుటేషన్ వంటి ప్రక్రియలు అవసరమవుతాయి. కుటుంబ సభ్యుల మధ్య వివాదం లేని సందర్భాల్లో కూడా పత్రాల సమర్పణ, ధృవీకరణ, అధికారుల పరిశీలన వంటి దశలు ఉంటాయి. ఈ ప్రక్రియలో జాప్యం జరిగితే రైతులు తమ భూమి రికార్డులను నవీకరించుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొనవచ్చు.

ప్రతి వారసత్వ దరఖాస్తును ఒకే విధంగా చూడటం సాధ్యం కాకపోయినా, వివాదం లేని దరఖాస్తులను అనవసరంగా పెండింగ్‌లో ఉంచకూడదు. వివాదం ఉన్నప్పుడు దాని స్వరూపాన్ని గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. ఏ దశలో దరఖాస్తు ఉందో తెలియజేయాలి. ఏ పత్రాలు సమర్పించాలో ముందుగానే వివరించాలి. ఒకే పత్రాన్ని మళ్లీ మళ్లీ అడిగే పరిస్థితి రాకుండా రికార్డుల నిర్వహణను సమర్థంగా చేయాలి.

ప్రభుత్వం ఈ అంశంపై ప్రత్యేక దృష్టి పెట్టాలి. వారసత్వ భూముల దరఖాస్తుల్లో ఎంత శాతం నిర్ణీత సమయంలో పరిష్కారమవుతున్నాయి? ఎంత శాతం వివాదాల కారణంగా పెండింగ్‌లో ఉన్నాయి? పరిపాలనా కారణాలతో నిలిచిపోయిన దరఖాస్తుల సంఖ్య ఎంత? ఈ వివరాలు అందుబాటులో ఉంటే సమస్యల స్వరూపం తెలుస్తుంది. అప్పుడు మాత్రమే పరిష్కారానికి సరైన ప్రణాళిక రూపొందించవచ్చు.

**పెండింగ్ దరఖాస్తుల లెక్కలు చెప్పాల్సిందే!**

భూ భారతి వ్యవస్థ పనితీరుపై చర్చ జరుగుతున్నప్పుడు అత్యంత కీలకమైన ప్రశ్న దరఖాస్తుల పరిష్కారానికి సంబంధించినదే. ఎన్ని దరఖాస్తులు స్వీకరించారు? ఎన్ని పరిష్కరించారు? ఎన్ని తిరస్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి? ఎక్కువ కాలంగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులు ఎన్ని? ఏ జిల్లాల్లో, ఏ మండలాల్లో ఎక్కువ జాప్యం జరుగుతోంది? ఈ వివరాలను ప్రభుత్వం అధికారికంగా వెల్లడించాలి.

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం దరఖాస్తుల సంఖ్యను ప్రకటించడం మాత్రమే సరిపోదు. వాటి పరిష్కారానికి పట్టిన సగటు సమయం, నిర్దేశించిన గడువులో పరిష్కరించిన దరఖాస్తుల శాతం, తిరస్కరణలకు ప్రధాన కారణాలు, అప్పీళ్లపై తీసుకున్న చర్యలు వంటి వివరాలు కూడా వెల్లడించాలి. ప్రజలకు సేవలందించే వ్యవస్థపై ప్రజలకు ప్రశ్నించే హక్కు ఉంది. ఆ ప్రశ్నలకు సమాధానం ఇవ్వడం ప్రభుత్వ జవాబుదారీతనంలో భాగం.

సమస్యలున్నాయని చెప్పేవారిని తప్పుపట్టడం కంటే, సమస్యలు ఎక్కడ ఉన్నాయో గుర్తించడం ముఖ్యం. రైతుల ఫిర్యాదులను సేకరించి, వాటిని వర్గీకరించి, పరిష్కార చర్యలను ప్రకటించాలి. నెలవారీగా పురోగతిని సమీక్షించి ప్రజలకు తెలియజేయాలి. ఒక జిల్లా వెనుకబడితే దానికి కారణాలను పరిశీలించాలి. అధికారులు, సాంకేతిక విభాగాలు, రెవెన్యూ యంత్రాంగం సమన్వయంతో పనిచేసేలా చూడాలి.

**ప్రభుత్వానికి కీలక ప్రశ్న.. బాధ్యత ఎవరిది?**

ఒక రైతు దరఖాస్తు సాంకేతిక కారణంతో ఆగిపోయిందనుకుందాం. ఆ సమస్యను పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? సర్వర్ సమస్య అయితే సాంకేతిక విభాగానిదా? రికార్డుల ధృవీకరణ అయితే రెవెన్యూ అధికారులదా? దరఖాస్తు ఏ విభాగంలో ఉందో రైతుకు తెలియకపోతే అతను ఎవరిని సంప్రదించాలి? ఫిర్యాదు చేసినా పరిష్కారం రాకపోతే తదుపరి స్థాయి ఏమిటి?

ఈ ప్రశ్నలకు స్పష్టమైన వ్యవస్థ ఉండాలి. సమస్యను ఒక శాఖ నుంచి మరో శాఖకు నెట్టే విధానం ఉండకూడదు. ప్రతి ఫిర్యాదుకు బాధ్యత వహించే అధికారి లేదా విభాగాన్ని గుర్తించాలి. పరిష్కారానికి గడువు నిర్ణయించాలి. గడువు దాటితే కారణాన్ని నమోదు చేయాలి. అవసరమైనప్పుడు ఉన్నతాధికారులు జోక్యం చేసుకునే విధానం ఏర్పాటు చేయాలి.

జవాబుదారీతనం అంటే తప్పు చేసిన వారిని శిక్షించడం మాత్రమే కాదు. తప్పు జరగకుండా వ్యవస్థను రూపొందించడం, సమస్యను త్వరగా గుర్తించడం, రైతుకు సమాచారం ఇవ్వడం, ఆలస్యాన్ని తగ్గించడం కూడా అందులో భాగమే. భూ భారతి వ్యవస్థలో ఈ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వకపోతే సాంకేతికతపై పెట్టిన పెట్టుబడి ఆశించిన ఫలితాలను ఇవ్వదు.

**రైతు సమయానికి విలువ లేదా?**

భూమి సమస్య కోసం రైతు కార్యాలయానికి వెళ్లినప్పుడు అతను ఖర్చు పెట్టేది కేవలం ప్రయాణ డబ్బు మాత్రమే కాదు. ఆ సమయంలో చేయాల్సిన వ్యవసాయ పని కూడా వాయిదా పడవచ్చు. విత్తనాలు, ఎరువులు, నీటి నిర్వహణ, పంట సంరక్షణ వంటి పనులకు సమయానికి ప్రాధాన్యం ఉంటుంది. రైతు తన భూమి రికార్డుల కోసం పదేపదే తిరగాల్సి వస్తే ఈ పనుల నిర్వహణలో ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది.

ప్రతి రైతుకు ఇలాంటి నష్టం ఎంత జరిగిందనే దానికి గణాంకాలు అవసరమే. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం: ప్రజా సేవల్లో అనవసరపు జాప్యాన్ని తగ్గించడం ప్రభుత్వ బాధ్యత. ప్రజలు తమ సమయాన్ని, శ్రమను వృథా చేసుకోకుండా సేవలు పొందేలా వ్యవస్థను రూపొందించాలి.

ఆన్‌లైన్ దరఖాస్తులపై సహాయం అందించేందుకు గ్రామస్థాయి లేదా మండలస్థాయి సహాయ కేంద్రాలను బలోపేతం చేయాలి. రైతులు సమర్పించిన పత్రాలను డిజిటల్‌గా భద్రపరచాలి. ఇప్పటికే ఉన్న సమాచారాన్ని మళ్లీ మళ్లీ సమర్పించాల్సిన అవసరం తగ్గించాలి. సేవలపై అవగాహన కల్పించాలి. ముఖ్యంగా వృద్ధులు, సాంకేతిక పరిజ్ఞానం తక్కువగా ఉన్న రైతులకు సహాయం అందించాలి.

**ప్రకటనలతో కాదు.. ఫలితాలతోనే ప్రభుత్వ పనితీరు!**

ప్రభుత్వాలు కొత్త పథకాలు, కొత్త పోర్టళ్లు, కొత్త విధానాలను ప్రకటించడం సాధారణమే. కానీ ప్రజలు వాటి పేర్లను గుర్తుంచుకోవడం కంటే వాటి వల్ల తమ సమస్యలు పరిష్కారమయ్యాయా లేదా అన్నదే చూస్తారు. భూ భారతి కూడా దీనికి మినహాయింపు కాదు. రైతుకు భూమి రికార్డు సరిగా అందితే, దరఖాస్తు సకాలంలో పరిష్కారమైతే, అవసరమైన సమాచారం స్పష్టంగా లభిస్తేనే ఆ వ్యవస్థ విజయవంతమైనట్లు. పోర్టల్ ప్రారంభించిన తేదీ, సేవల సంఖ్య, సాంకేతిక సదుపాయాల గురించి చెప్పడం ఒక అంశం. రైతు అనుభవం మరో అంశం. ఆన్‌లైన్ సేవలు ఎంత సులభంగా పనిచేస్తున్నాయి? దరఖాస్తు పూర్తి చేయడానికి ఎంత సమయం పడుతోంది? సమస్య వచ్చినప్పుడు సహాయం ఎంత త్వరగా అందుతోంది? ఈ అంశాల ఆధారంగా పనితీరును అంచనా వేయాలి.

ప్రభుత్వం తన పనితీరును తానే సమీక్షించుకోవాలి. రైతు సంఘాలు, రెవెన్యూ నిపుణులు, ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులతో చర్చించి సమస్యలను గుర్తించాలి. విమర్శలను వ్యతిరేకతగా కాకుండా సవరణలకు అవకాశంగా చూడాలి. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులే వ్యవస్థలోని లోపాలను గుర్తించేందుకు ఉపయోగపడతాయి.

**భూ రికార్డుల సమస్యలను చిన్నచూపు చూడొద్దు!**

భూమి రికార్డులు వ్యక్తిగత హక్కులు, కుటుంబ ఆస్తులు, వ్యవసాయ కార్యకలాపాలతో ముడిపడి ఉంటాయి. ఒక రికార్డులో పొరపాటు ఉందని చెప్పి దాన్ని సరిచేయకుండా వదిలేయడం సరికాదు. అదే సమయంలో తగిన ధృవీకరణ లేకుండా రికార్డుల్లో మార్పులు చేయడం కూడా తగదు. రైతు హక్కులను కాపాడుతూ, చట్టపరమైన విధానాలను పాటిస్తూ, నిర్ణీత సమయంలో సమస్యను పరిష్కరించడం సమర్థమైన పరిపాలనకు గుర్తు.

దీనికోసం పాత రికార్డులు, కొత్త డిజిటల్ వివరాలు, సర్వే పత్రాలు, సంబంధిత ధృవీకరణలను సమన్వయం చేయాలి. అవసరమైన సందర్భాల్లో క్షేత్రస్థాయి పరిశీలన నిర్వహించాలి. రైతుకు తన వాదన వినిపించే అవకాశం కల్పించాలి. నిర్ణయాన్ని స్పష్టమైన కారణాలతో తెలియజేయాలి. వివాదం ఉన్న సందర్భాల్లో అందుబాటులో ఉన్న అప్పీల్ లేదా న్యాయపరమైన మార్గాలను వివరించాలి. రైతుకు న్యాయం జరగాలంటే వేగం అవసరం. కానీ వేగం పేరుతో తప్పులు జరగకూడదు. పారదర్శకత పేరుతో బాధ్యత తప్పించుకోకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతను పాటించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.

**ఇకనైనా ప్రభుత్వం కార్యాచరణ ప్రకటించాలి!**

భూ భారతి వ్యవస్థలో సమస్యలపై ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను ప్రకటించాల్సిన అవసరం ఉంది. అందులో కనీసం ఐదు అంశాలు ఉండాలి.

మొదటిది.. సర్వర్, ఆన్‌లైన్ సేవలపై సాంకేతిక సమీక్ష నిర్వహించి తరచుగా ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించాలి.

రెండోది.. పెండింగ్ దరఖాస్తులపై జిల్లా, మండలాల వారీగా అధికారిక గణాంకాలను వెల్లడించాలి.

మూడోది.. ప్రతి సేవకు సాధ్యమైనంత స్పష్టమైన పరిష్కార గడువు ప్రకటించి, దరఖాస్తు స్థితిని రైతుకు తెలియజేయాలి.

నాలుగోది.. ఆన్‌లైన్ సేవలు పనిచేయని సందర్భాల్లో రైతులు ఫిర్యాదు చేయడానికి, ప్రత్యామ్నాయ సహాయం పొందడానికి సులభమైన విధానం కల్పించాలి.

ఐదోది.. పరిష్కార పురోగతిపై క్రమం తప్పకుండా సమీక్ష నిర్వహించి ప్రజలకు నివేదిక అందించాలి.

ఈ చర్యలు అమలైతే రైతులకు ఎదురయ్యే అనవసరపు ఇబ్బందులు తగ్గే అవకాశం ఉంది. వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. దరఖాస్తుల పరిష్కారంలో పారదర్శకత మెరుగుపడుతుంది. ముఖ్యంగా రైతు తన సమస్య ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు అధికారుల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుంది.

**విమర్శలకు సమాధానం చర్యలే!**

భూ భారతి వ్యవస్థపై రైతుల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయంటే వాటిని పరిశీలించడం ప్రభుత్వ బాధ్యత. అన్ని సమస్యలూ ఒకే కారణంతో వస్తున్నాయని చెప్పలేం. కొన్ని సాంకేతిక సమస్యలు కావచ్చు. మరికొన్ని రికార్డుల వ్యత్యాసాలు, పత్రాల కొరత, వారసత్వ వివాదాలు లేదా చట్టపరమైన అంశాలు కావచ్చు. అందుకే ప్రతి సమస్యను దాని స్వరూపం ఆధారంగా పరిశీలించి పరిష్కరించాలి.

అయితే సమస్యల కారణం ఏదైనా రైతుకు స్పష్టమైన సమాచారం అందాలి. తన దరఖాస్తు ఎందుకు నిలిచిపోయిందో తెలుసుకునే హక్కు అతనికి ఉంది. పరిష్కారం కోసం ఏం చేయాలో చెప్పాల్సిన బాధ్యత అధికారులకు ఉంది. ఈ కనీస సేవలు అందకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరుగుతుంది.

ప్రభుత్వం విమర్శలను ఎదుర్కొనేందుకు ప్రకటనలు చేయవచ్చు. కానీ రైతుకు కావాల్సింది ప్రకటన కాదు. తన దరఖాస్తుపై నిర్ణయం, తన భూమి రికార్డులపై స్పష్టత, తన సమస్యకు పరిష్కారం. అందుకే ప్రభుత్వ స్పందన మాటల్లో కాకుండా క్షేత్రస్థాయిలో కనిపించాలి.

**రైతు హక్కు.. ప్రభుత్వ బాధ్యత!**

భూమిపై హక్కును నిర్ధారించుకోవడం కోసం రైతు నిరీక్షించాల్సిన పరిస్థితి తగ్గాలి. రికార్డుల సవరణకు పారదర్శక విధానం ఉండాలి. మ్యుటేషన్ దరఖాస్తులు సకాలంలో పరిష్కారమవ్వాలి. సర్వర్ సమస్యలకు తక్షణ స్పందన ఉండాలి. పెండింగ్ వివరాలు ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఫిర్యాదులకు నిర్ణీత సమయంలో సమాధానం రావాలి. ఇవి రైతు కోరుతున్న కనీస పరిపాలనా ప్రమాణాలు.

భూ భారతి విజయవంతమైందా లేదా అన్నది అధికారిక ప్రకటనలతో తేలదు. రైతు తన భూమి సమస్యను పరిష్కరించుకున్నాడా లేదా అన్నదే అసలైన ప్రమాణం. సాంకేతికతను ప్రవేశపెట్టడం ఎంత ముఖ్యమో, దాన్ని ప్రజలకు ఉపయోగపడేలా నిర్వహించడం అంతకంటే ముఖ్యం.

**చివరగా.. రైతుకు భరోసా కావాలి, నిరీక్షణ కాదు!**

భూ భారతి రైతుకు భరోసా కల్పించాల్సిన వ్యవస్థ. అది మరో సమస్యగా మారకూడదు. రైతు తన భూమి హక్కుల కోసం పదేపదే కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితిని తగ్గించడం ప్రభుత్వ ప్రాధాన్యంగా ఉండాలి. సాంకేతిక లోపాలను సరిచేయాలి. పెండింగ్ దరఖాస్తులకు పరిష్కారం చూపాలి. అధికారుల బాధ్యతను స్పష్టం చేయాలి. రైతుకు సమాచారం, సహాయం, న్యాయం అందించాలి.

ప్రజాస్వామ్యంలో ప్రభుత్వం ప్రజలకు జవాబుదారీ. భూమి హక్కుల విషయంలో ఆ బాధ్యత మరింత కీలకం. ఎందుకంటే రైతు భూమిపై ఆధారపడేది కేవలం ఆదాయం కోసం కాదు.. తన కుటుంబ భవిష్యత్తు కోసం కూడా.

భూమి రైతుది.. హక్కు రైతుది.. సమస్య పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిది. భూ భారతి రైతుకు భరోసాగా నిలవాలి తప్ప, అంతులేని నిరీక్షణకు ప్రతీకగా మారకూడదు!



ఎం రవీందర్
సీనియర్ జర్నలిస్టు
7901503777



## మృతుని కుటుంబానికి ఏజేఆర్ ఫౌండేషన్ ఆర్థిక భరోసా

**వలిగొండ,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం పైల్వాన్‌పురం గ్రామానికి చెందిన దుబ్బ పెంటయ్య కుటుంబానికి ఏజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు.

దుబ్బ పెంటయ్య ఈ నెల 2వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు అదృశ్యమైన వ్యక్తిగా కేసు నమోదు చేశారు. ఈ నెల 14న కేర్చిపల్లి గ్రామ శివారులోని వ్యవసాయ భూమి వద్ద గుర్తుతెలియని స్థితిలో మృతదేహం కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వగా, వారు అక్కడికి చేరుకుని మృతదేహాన్ని పెంటయ్యగా గుర్తించారు.

ఈ విషయం తెలుసుకున్న ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఎలిమినేటి జంగారెడ్డి సహకారంతో ఫౌండేషన్ సభ్యులు మృతుని కుటుంబ సభ్యులకు రూ.5,000 ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి మహిళా మోర్చా జిల్లా ఉపాధ్యక్షురాలుగా ఎంగరెడ్డి కమలమ్మ

**శంషాబాద్,అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం)**



బీజేపీ మహిళా మోర్చా రంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షురాలుగా శంషాబాద్ కు చెందిన ఆ పార్టీ సీనియర్ నాయకురాలు ఎంగరెడ్డి కమలమ్మ నియమితులయ్యారు .ఈనెల 12 వ తేదీన 31 మంది తో మహిళ మోర్చా నూతన కార్యవర్గాన్ని మహిళా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ ప్రకటించారు. గురువారంఆమె శంషాబాద్ లో మీడియాతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలుగా నియమించిన రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు మమతారెడ్డి , మైలార్దేవ్ పల్లి మాజీ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. తనపై పార్టీ ఉంచిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు . ఈ మేరకు ఆమె జిల్లా అధ్యక్షులు రాజ్ భూపాల్ గౌడ్ ను మర్యాదపూర్వకంగా కలుసుకొని పార్టీ అభివృద్ధిపై చర్చించారు.

## పెద్దేముల్ శ్రీ వీరాంజనేయ దేవాలయానికి రూ.1 లక్ష విరాళం ఇచ్చిన పట్నం మహేందర్ రెడ్డి

- ధ్వజస్తంభ ప్రతిష్ఠాపనలో పాల్గొని ప్రత్యేక పూజలు
- ఆలయ అభివృద్ధికి మరింత సహకారం అందిస్తానని హామీ

**పెద్దేముల్,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా పెద్దేముల్ మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన శ్రీ వీరాంజనేయ దేవాలయ అభివృద్ధికి రాష్ట్ర శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్‌రెడ్డి రూ.లక్ష విరాళం అందించారు.

గురువారం ఆలయంలో నిర్వహించిన హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠాపన, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమాలకు ఆయన హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన వైదిక కార్యక్రమాల్లో పట్నం మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు. హనుమాన్ స్వామివారికి, నూతనంగా ప్రతిష్ఠించిన ధ్వజస్తంభానికి మంగళహారతులు సమర్పించి భక్తితో పూజలు చేశారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం తనవంతు సహాయంగా రూ.లక్ష విరాళాన్ని అందజేశారు.

ఆలయానికి అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనతో పాటు భవిష్యత్తులో చేపట్టే అభివృద్ధి పనులకు కూడా తనవంతు సహకారం అందిస్తానని పట్నం మహేందర్‌రెడ్డి తెలిపారు.ఆధ్యాత్మిక కేంద్రాల అభివృద్ధి, భక్తులకు మెరుగైన సదుపాయాల కల్పనకు సహకరించడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్ ,పెద్దేముల్ గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ పెద్దలు, సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## మందకృష్ణ మాదిగతో పొద్దుటూరు సర్పంచ్ ఆత్మీయ సంభాషణ

**పెద్దేముల్, అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**



పొద్దుటూరు గ్రామ సర్పంచ్ లక్ష్మి నరసింహ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగను గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో కొద్దిసేపు మాట్లాడి వివిధ అంశాలపై ఆత్మీయంగా ముచ్చటించారు. ఈ మర్యాదపూర్వక భేటీ స్నేహపూర్వక వాతావరణంలో సాగింది. సామాజిక ఉద్యమాల్లో విశేష గుర్తింపు పొందిన మందకృష్ణ మాదిగను కలవడం పట్ల పొద్దుటూరు సర్పంచ్ లక్ష్మి నరసింహ సంతోషం వ్యక్తం చేశారు. సామాజిక ఉద్యమ రంగంలో తనదైన గుర్తింపు సంపాదించుకున్న మందకృష్ణ మాదిగను కలిసిన సందర్భంగా సర్పంచ్ లక్ష్మి నరసింహ మర్యాదపూర్వకంగా పలకరించి మాట్లాడారు. ప్రజాజీవితంలో వివిధ బాధ్యతలు నిర్వహిస్తున్న నాయకులు పరస్పరం కలుసుకోవడం, ఆత్మీయంగా సంభాషించుకోవడం ద్వారా సామాజిక సంబంధాలు మరింత బలోపేతం అవుతాయని ఈ భేటీ ప్రాధాన్యతను సంతరించుకుంది. పొద్దుటూరు గ్రామ సర్పంచ్‌గా లక్ష్మి నరసింహ గ్రామ ప్రజలకు సంబంధించిన బాధ్యతలను నిర్వహిస్తుండగా, మందకృష్ణ మాదిగ సామాజిక ఉద్యమ నాయకుడిగా గుర్తింపు పొందారు. ఈ క్రమంలో ఇరువురి మర్యాదపూర్వక కలయిక స్థానికంగా ప్రాధాన్యత సంతరించుకుంది.

# ఎల్‌నినోపై ముందస్తు చర్యలేవి?

- రైతుల కష్టాలకు బాధ్యులెవరు?
- కరెంట్ కోతలతో ప్రజలకు ఇబ్బందులు.
- తాండూరు వనరులను కొడంగల్‌కు తరలిస్తున్నారని ఆరోపణలు.
- మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి విమర్శలు.

**తాండూరు,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

రాష్ట్రంలో కరువు పరిస్థితులు, విద్యుత్ కోతలు, రైతుల పంట నష్టాలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకుని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి విమర్శలు గుప్పించారు. ఎల్‌నినో ప్రభావాన్ని ముందుగానే అంచనా వేసి రైతులను ఆదుకునేందుకు తగిన చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. ప్రజలకు నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు తక్షణమే పరిహారం అందించాలని డిమాండ్ చేశారు.

**కరెంట్ కోతలతో ప్రజలకు ఇక్కట్లు**

రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ కోతలు, లోవోల్టేజ్ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రోహిత్ రెడ్డి అన్నారు. గతంలో వినియోగం తగ్గిన జనరేటర్లు, ఇన్వర్టర్లను మళ్లీ బయటకు తీసే పరిస్థితి వచ్చిందని వ్యాఖ్యానించారు. కనీస అవసరాలకు సరిపడా విద్యుత్‌ను కూడా సక్రమంగా సరఫరా చేయలేకపోతున్నారని ప్రభుత్వంపై విమర్శలు చేశారు. రైతుల సమస్యలు, విద్యుత్ సరఫరా పరిస్థితి, సింగరేణి భవిష్యత్తుపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

**కాగ్నా ఇసుక దోపిడీపై ఆరోపణలు**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తాండూరు ప్రాంతంలో భూగర్భ జలాల పెంపునకు కాగ్నా నదిపై 11 చెక్‌డ్యామ్‌లు నిర్మించామని రోహిత్ రెడ్డి పేర్కొన్నారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో కాగ్నా నదిలో ఇసుక తవ్వకాలు విచ్చలవిడిగా సాగుతున్నాయని ఆరోపించారు. నదీ వనరులను కాపాడటంతోపాటు భూగర్భ జలాల పరిరక్షణకు ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

**తాండూరు వనరులు కొడంగల్‌కు తరలిస్తున్నారా?**

తాండూరు ప్రాంతానికి చెందాల్సిన వనరులు, సౌకర్యాలను కొడంగల్‌కు తరలిస్తున్నారని మాజీ ఎమ్మెల్యే ఆరోపించారు. జిల్లా ఆస్పత్రి విషయంలో తాండూరుకు అన్యాయం జరిగిందని, ఇప్పుడు ఆర్డీఓ కార్యాలయాన్ని కూడా కొడంగల్‌కు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. తాండూరు ప్రాంత ప్రజలకు అందాల్సిన ప్రభుత్వ సేవలు, వసతులు ఇక్కడే అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

**సింగరేణి ప్రైవేటీకరిస్తే ఉద్యమం**

తెలంగాణ ఆర్థిక వ్యవస్థకు, కార్మికుల జీవనోపాధికి కీలకమైన సింగరేణి సంస్థను ప్రైవేటీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని రోహిత్ రెడ్డి ఆరోపించారు. సింగరేణిని ప్రైవేటీకరించే చర్యలకు ప్రభుత్వం పాల్పడితే చూస్తూ ఊరుకోబోమని, ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. సంస్థ భవిష్యత్తుపై ప్రభుత్వం స్పష్టమైన వైఖరిని ప్రకటించాలని కోరారు.

**రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించాలి**

వర్షాభావ పరిస్థితులు, కరువు ప్రభావంతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని రోహిత్ రెడ్డి డిమాండ్ చేశారు. నష్టపోయిన పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన రైతులకు నష్టపరిహారం అందించాలని కోరారు. రైతుల సమస్యల పరిష్కారం, విద్యుత్ సరఫరా మెరుగుదల, తాండూరు ప్రాంత అభివృద్ధి, సింగరేణి పరిరక్షణపై ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.




# పంటను బ్రతికించుకోవడానికి చెమటోడుస్తున్న రైతు దంపతులు!

- రెండు ఎకరాల్లో కంది పంట సాగు..దిగుబడిపై రైతు దంపతులు రామావత్ శాంతదేవి సురేందర్ నాయక్ ల ఆందోళన
- పంటను కాపాడుకునేందుకు బోరు నీటితో తడులు.. అన్నదాతల అవస్థలు
- కందనెల్లి తండాలో వర్షా భావంతో దయనీయ పరిస్థితి

**పెద్దేముల్, అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

ఆరుగాలం శ్రమించి సాగు చేసిన పంటను కాపాడుకునేందుకు అన్నదాతలు అష్టకష్టాలు పడుతున్నారు. ఆకాశం వైపు ఆశగా ఎదురు చూసినా వరుణుడు కరుణించకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్నాయి.ఇప్పటికే వేల రూపాయలు పెట్టుబడి పెట్టిన రైతులు, పంట చేతికందుతుందో లేదోనన్న ఆందోళనతో సతమతమవుతున్నారు.

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో కంది పంటను కాపాడుకునేందుకు కందనెల్లి తండాకు చెందిన రైతు దంపతులు రామావత్ శాంతాదేవి, సురేందర్ నాయక్ మహరాజ్ పడుతున్న శ్రమ అన్నదాతల కష్టాలకు అద్దం పడుతోంది.

**రెండు ఎకరాల్లో కంది సాగు**

వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గం పెద్దేముల్ మండలంలోని కందనెల్లి రెవెన్యూ పరిధి, కందనెల్లి తండా శివారులోని సర్వే నంబర్ 273లో తమకు ఆనువంశికంగా సంక్రమించిన రెండు ఎకరాల వ్యవసాయ భూమిలో రైతు దంపతులు ఈ ఏడాది కంది పంట సాగు చేశారు. విత్తనాలు, దుక్కి, ఇతర వ్యవసాయ పనుల కోసం ఇప్పటివరకు సుమారు రూ.60 వేల వరకు పెట్టుబడి పెట్టినట్లు వారు తెలిపారు. పంట ఏపుగా పెరిగి మంచి దిగుబడి వస్తుందని ఆశించిన తరుణంలో వర్షాలు లేకపోవడంతో పరిస్థితి తారుమారైంది. పంటకు అవసరమైన తేమ అందక ఎండిపోతుండటంతో దిగుబడిపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**బోరు నీటితో పంటను కాపాడుకునే ప్రయత్నం**

కళ్లముందే పంట ఎండిపోతుంటే చూడలేక, ఎలాగైనా కాపాడుకోవాలనే సంకల్పంతో రైతు దంపతులు ప్రత్యామ్నాయ మార్గాన్ని అనుసరిస్తున్నారు. తమ పొలానికి సమీపంలోని సర్వే నంబర్ 272లో ఉన్న యాడీబాపు గడ్ దేవస్థాన్ ఆధ్యాత్మిక కేంద్రంలో భక్తుల నీటి అవసరాల కోసం ఏర్పాటు చేసిన బోరు నుంచి నీటిని పైపుల ద్వారా పొలానికి తరలిస్తున్నారు. ఆ నీటితో కంది పంటకు తడులు అందిస్తూ పంటను నిలబెట్టుకునేందుకు శ్రమిస్తున్నారు. వర్షాలు కురవకపోయినా, తమ కష్టార్జితం వృథా కాకూడదనే ఆశతో ఎండను సైతం లెక్కచేయకుండా సాగును కాపాడుకునేందుకు ప్రయత్నిస్తున్నారు.

**పెట్టుబడి తిరిగొస్తుందో లేదోనని ఆవేదన**





వ్యవసాయమే జీవనాధారంగా బతుకుతున్న రైతు కుటుంబాలకు వర్షాభావ పరిస్థితులు తీవ్ర ఆర్థిక భారాన్ని మిగులుస్తున్నాయి. పంట సాగు కోసం చేసిన అప్పులు, పెట్టిన పెట్టుబడులు తిరిగి వస్తాయో లేదోనన్న భయం రైతులను వెంటాడుతోంది. ఇప్పటికే రూ.60 వేల వరకు ఖర్చు చేసిన తమ కంది పంటను కాపాడుకోవడానికి బోరు నీటిపై ఆధారపడాల్సి వస్తోందని రైతు దంపతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతి సహకరించకపోవడంతో సాగు ఖర్చులు పెరుగుతుండగా, ఆశించిన దిగుబడి రాకపోతే మరింత నష్టపోవాల్సి వస్తుందని వాపోతున్నారు.

**క్షేత్రస్థాయిలో పరిశీలించాలి**

వర్షాభావంతో ఇబ్బందులు పడుతున్న రైతుల పరిస్థితిని సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని రైతు దంపతులు కోరుతున్నారు. పంటల పరిస్థితిని అంచనా వేసి, అవసరమైన సలహాలు, సహాయక చర్యలు అందించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. వర్షాల కోసం ఎదురుచూస్తూ, మరోవైపు పంటను కాపాడుకునేందుకు నీటి వనరులపై ఆధారపడుతున్న రైతులకు భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. రైతు చెమట చిందించి పండించే పంట ప్రకృతి వైపరీత్యాలకు బలికాకుండా సంబంధిత యంత్రాంగం స్పందించాలని అన్నదాతలు ఆశిస్తున్నారు.



# వీధిలైట్లు మరియు ఇంటింటికి ఇంకుడు గుంతల కార్యక్రమాన్ని చేపట్టిన సర్పంచ్ రాజ్ కుమార్

**జోగులాంబ గద్వాల,అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

జోగులాంబ గద్వాల జిల్లా నక్కలపల్లి కొద్దేవరపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ రాజకుమార్ ఇంటింటికి ఇంకుడు గుంతలు, వీధి లైట్లు వేయించారు.

ఈ సందర్భంగా సర్పంచ్ రాజకుమార్ మాట్లాడుతూ

గ్రామాల్లో ఇంటింటికీ ఇంకుడు గుంతలు తవ్వించడం మరియు వీధి లైట్లు వేయించడం అనేవి ఒక సర్పంచ్ ఆదర్శవంతమైన పాలనకు, గ్రామ అభివృద్ధికి నిదర్శనం. పల్లెల్లో మౌలిక వసతుల కల్పనలోనూ, పర్యావరణ పరిరక్షణలోనూ ఈ రెండు పనులు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తాయి అని తెలిపారు.

ఈ రెండు పనుల వల్ల గ్రామానికి చేకూరే ముఖ్య ప్రయోజనాలు:

1. ఇంటింటికీ ఇంకుడు గుంతలు (భూగర్భ జలాల పెంపు)

నీటి సంరక్షణ: వర్షపు నీరు మరియు ఇళ్ల నుంచి వచ్చే వృథా నీరు రోడ్లపైకి చేరి మురికిగా మారకుండా, నేరుగా భూమిలోకి ఇంకేలా ఈ గుంతలు దోహదపడతాయి.

భూగర్భ జలాల వృద్ధి: గ్రామంలోని బోర్లు, బావుల్లో నీటి మట్టం పెరిగి, వేసవి కాలంలో కూడా తాగునీటి ఎద్దడి రాకుండా ఉంటుంది.

ఆరోగ్యకరమైన వాతావరణం: మురుగునీరు నిల్వ ఉండకపోవడం వల్ల దోమల ఉధృతి తగ్గి, మలేరియా, డెంగ్యూ వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ఉంటాయి.



**2. వీధి లైట్ల ఏర్పాటు (గ్రామ రక్షణ)**

రాత్రి వేళల్లో భద్రత: చీకటి పడ్డాక గ్రామస్తులు, ముఖ్యంగా మహిళలు, వృద్ధులు మరియు పిల్లలు సురక్షితంగా తిరగడానికి వీధి దీపాలు ఎంతో అవసరం.

నేరాల నియంత్రణ: వీధులు వెలుతురుతో ఉండటం వల్ల దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలు తగ్గుతాయి.

ప్రమాదాల నివారణ: రాత్రి వేళల్లో రోడ్లపై ఉండే గుంతలు, సర్పాలు (పాములు) వంటి వాటి వల్ల గ్రామస్తులు ప్రమాదాలకు గురికాకుండా ఉంటారు.

ప్రభుత్వ నిధులు (ఉపాధి హామీ పథకం వంటివి) లేదా సొంత ఖర్చులతో ఇటువంటి పనులను పూర్తి చేసి, గ్రామాన్ని ప్రగతి పథంలో నడిపించే సర్పంచులు ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తారు అని సర్పంచ్ రాజకుమార్ తెలిపారు.

# వైభవంగా పెద్దేముల్ శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు!

- వేద మంత్రోచ్చారణలు.. మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక సందడి
- సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపనతో పుణ్యప్రదమైన వేడుకలు
- భక్తిపారవశ్యంలో సీతారాముల కల్యాణోత్సవం.. భక్తులకు మహా అన్నదానం
- ముఖ్య అతిథులుగా పట్నం మహేందర్‌రెడ్డి, బుయ్యని మనోహర్‌రెడ్డి, పైలట్ రోహిత్‌రెడ్డి, జాదవ్ ధారాసింగ్ నాయక్

**పెద్దేముల్,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం):**

భక్తి పారవశ్యం.. వేద మంత్రాల ప్రతిధ్వని.. మంగళ వాయిద్యాల మధుర నాదాలు.. హనుమ నామస్మరణలతో పెద్దేముల్ మండల కేంద్రంలోని శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. రెండు రోజుల పాటు నిర్వహించిన ఆలయ బ్రహ్మోత్సవాలు, సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన మహోత్సవాలు భక్తజనుల సమక్షంలో అంగరంగ వైభవంగా ముగిశాయి. పరిసర గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రత్యేక పూజలు, వైదిక క్రతువులు, సీతారాముల కల్యాణోత్సవం, మహా అన్నదానంతో పెద్దేముల్ ప్రాంతంలో పండుగ వాతావరణం నెలకొంది.

**శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపన కార్యక్రమాలు**

మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు ఆవాహిత స్థాపిత దేవతా పూజ, మూలమంత్ర హోమం, గర్త సంస్కారం, యంత్ర స్థాపన తదితర వైదిక కార్యక్రమాలను వేద పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వేద మంత్రోచ్చారణల నడుమ మూలమూర్తి సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పూర్ణాహుతితో వైదిక క్రతువులు ముగిశాయి. అనంతరం శ్రీ వీరాంజనేయ స్వామివారికి పంచామృత అభిషేకం, సింధూర సమర్పణ, విశేష అలంకరణలు నిర్వహించి భక్తులకు స్వామివారి దర్శన భాగ్యం కల్పించారు. ప్రతిష్ఠాపన కార్యక్రమాలను తిలకించిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

**కనులపండువగా సీతారాముల కల్యాణం**

బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచిన సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన కల్యాణ వేడుక భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది. సీతారాముల కల్యాణాన్ని వీక్షించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ప్రాంగణమంతా దైవనామస్మరణతో మార్మోగింది. భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రత్యేక పూజలు, సంప్రదాయబద్ధమైన ఆచారాలతో వేడుకలు ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పాయి.

**ముఖ్య అతిథుల ప్రత్యేక పూజలు**

శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ మహోత్సవాలకు తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్ నాయక్, ఎస్. నరేందర్‌రెడ్డి దొర, ధ్వజస్తంభ దాత కోహిర్ రాజు, చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి తదితరులు గౌరవ అతిథులుగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు .ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

**భక్తులకు మహా అన్నదానం**

కల్యాణోత్సవం అనంతరం భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు. రెండు రోజుల పాటు జరిగిన మహోత్సవాలను విజయవంతం చేసేందుకు గ్రామ సర్పంచ్, ఆలయ నిర్వాహకులు, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు సమన్వయంతో కృషి చేశారు. భక్తి, సంప్రదాయం, సామూహిక సేవాభావానికి ప్రతీకగా నిలిచిన శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు పెద్దేముల్ ప్రాంతంలో ఆధ్యాత్మిక వైభవాన్ని చాటిచెప్పాయి.





# ఎంపీటీసీ స్థానాలకు రిజర్వేషన్లు విడుదల చేసిన ఎంపీడీవో

**పాములపాడు,అక్టోబర్15 (ప్రజాక్షేత్రం):**

నంద్యాల జిల్లా కలెక్టర్,డిస్టిక్ ఎలక్షన్ అథారిటీ జి.రాజకుమారి గణియా నివేదిక ప్రకారం పాములపాడు మండలంలోని, 12 ఎంపీటీసీ స్థానాలకు వచ్చిన రిజర్వేషన్లను ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ విలేకరుల సమావేశంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో ఎన్.చంద్రశేఖర్ మాట్లాడుతూ మండలంలోని భానుముక్కలఎస్సీ, చెలిమిల్ల ఎస్సీ ఉమెన్,ఎర్రగూడూరు బిసి,ఇస్కాల అన్ రిజర్వుడ్ ఉమెన్, జూటూరు1 అన్ రిజర్వుడ్,జూటూరు2 ఎస్సీ, మద్దూరు అన్ రిజర్వుడ్, ఉమెన్,మిట్టకందాల అన్ రిజర్వుడ్, రుద్రవరంఅన్ రిజర్వుడ్ ఉమెన్, వానాలఅన్ రిజర్వుడ్, పాములపాడు బిసి ఉమెన్, వేంపెంట ఎస్టి ఉమెన్, ఈ విధంగా 12 ఎంపీటీసీ



స్థానాలకు రిజర్వేషన్లు ఖరారు చేయడం జరిగిందన్నారు. ఈ రిజర్వేషన్ల ప్రకారం ఆసక్తి ఉన్న అభ్యర్థులు ప్రభుత్వ నిబంధన ప్రకారము దరఖాస్తుకు కావలసిన ఆధారాలు రెడీ చేసుకోవాలని కోరారు.

# మహిళా సంఘాలకు తోడ్పాటు అందిస్తాం : టిజిజివిబి మేనేజర్

- సకాలంలో రైతులు రెన్యూవల్ చేసుకుంటే తక్కువ వడ్డీ
- గ్రామ యువతకు స్వయం ఉపాధి రుణాలను అందించాలి
- సర్పంచ్ రాజ్ కుమార్ విజ్ఞప్తిపై సానుకూలంగా స్పందించిన మేనేజర్

**జహీరాబాద్,అక్టోబర్ 15 (ప్రజాక్షేత్రం)**

మహిళా సంఘాల ప్రతినిధులు డ్వాక్రాలో తీసుకున్న రుణాలు క్రమం తప్పకుండ చెల్లిస్తే వారికీ పావలా వడ్డీ వర్తిస్తుందనీ, రైతులు తీసుకున్న రుణాలను ఏడాది లోపు చెల్లిస్తే తక్కువ వడ్డీ పడుతుందని బిలాల్ పుర్ టిజిజివీబి మేనేజర్ అన్నారు. మనియర్ పల్లి గ్రామ పంచాయతీలో గ్రామ సర్పంచ్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో సర్పంచ్ మాట్లాడుతూ గ్రామానికి చెందిన యువతకు స్వయం ఉపాధికి పెద్దపిటా వేస్తూ రుణలను అందించాలని కోరారు. సర్పంచ్ రాజ్ కుమార్ విజ్ఞప్తిపై మేనేజర్ సానుకూలంగా స్పందించారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అందించే రాయితీ రుణాలు తమ బ్యాంకు తరపున అందజేస్తామని, ఆసక్తి గల నిరుద్యోగులు వ్యాపారాలు ప్రారంభించుకోవడానికి ముందుకు వస్తే వ్యాపార రుణాలను అందిస్తామని సూచించారు.ఈ కార్యక్రమంలో ఫీల్డ్ ఆఫీసర్,వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# వైద్య విద్యకు శరీర నిర్మాణ శాస్త్రమే పునాది

- కర్నూలు వైద్య కళాశాలలో ప్రపంచ అనాటమీ దినోత్సవ వేడుకలు

**కర్నూలు,అక్టోబర్ 15(ప్రజాక్షేత్రం):**

వైద్య విద్యలో శరీర నిర్మాణ శాస్త్రం (అనాటమీ) కీలక పాత్ర పోషిస్తుందని కర్నూలు వైద్య కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ అన్నారు. ప్రపంచ అనాటమీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల అనాటమీ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో భాగంగా అక్టోబర్ 14న ప్రథమ సంవత్సరం ఎంబీబీఎస్ విద్యార్థులకు వక్తృత్వం, రంగవల్లులు, బాడీ పెయింటింగ్ పోటీలు నిర్వహించారు. 2026 బ్యాచ్‌కు చెందిన వంద మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొని ప్రతిభను చాటారు. "శరీర నిర్మాణ శాస్త్ర ప్రాధాన్యం" అంశంపై వక్తృత్వ పోటీ నిర్వహించారు. విజేతలకు, పాల్గొన్న విద్యార్థులకు డాక్టర్ హరిచరణ్ బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో అనాటమీపై ఆసక్తి పెంపొందించడం, సృజనాత్మక అభ్యాసాన్ని ప్రోత్సహించడం, శరీర దాతల పట్ల కృతజ్ఞతాభావాన్ని పెంపొందించడం ఈ వేడుకల లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో అనాటమీ విభాగాధిపతి డాక్టర్ శోభాదేవి, ప్రొఫెసర్ డాక్టర్ వాణిశ్రీ, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.




Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankar pally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394